"అబ్బ! ఎంత చల్లని గాలి వేస్తా ఉందో ఇక్కడ!" అనుక్కుంది ఆ పిల్ల, మనస్సులో. ఒక్క క్షణం అట్టే ఆగింది. కాస్త పరకాయించి చూచింది.

దారికి ఒక పక్క చిన్న చెరువు ఒకటి కనిపించింది. అక్క దక్కడా చిలవ చిలవలుగా నీళ్లతో, చెరువు నిండా తామర పువ్వులూ, కలువ పువ్వులూ ఆకులతో ఉంది. ఆకులన్నీ సగం సగంగా ఎగురుతూ తన పక్కగా మడతలు పడి పోతున్నాయి, గాలికి. మరో పక్కన చిన్న పెంకుటిల్లు ఒకటి కనిపించింది. ఆ ఇంటి చుట్టూ వెదురు బొంగు బద్దలతో అల్లిన కటకటాలు పాతి ఉన్నాయి. తన జావిణీ కొంగుతో తన మెడా, ముఖమూ తుడుచుకుని బాట కడ్డంగా నడిచి వెళ్లి, కటకటాల గేటు తెరుచుకుని ఇంటి ఆవరణలోకి వెళ్లింది. అంతా నిశ్శబ్దంగా ఉంది. తన నడుముకు ఆన్చుకున్న జంగిణీ తీసి ఇంటి వసారాలో అరుగు మీద పెట్టింది. ఇంటి లోపల నుంచీ ఏదో సుత్తితో నిమ్మళంగా కొడుతున్న శబ్దం వినొచ్చింది.

"పువ్వులమ్మ పువ్వులు పువ్వులు కావాలాండి?" అని నిమ్మళంగా గొంతెత్తి అరిచింది. ఒక క్షణంలో ఇంటో నించీ ఒక చేత్తో మేకూ, ఒక చేత్తో కుడుము రాయి పట్టుకుని వంగి చూచింది నడి వయస్సు మళ్లిన పార్వతమ్మ.

"ఏం పువ్వు లున్నాయి పిల్లా?" అడిగింది, ఆవిడ చిరు నవ్వు ముఖంతో.

"మల్లి పూలండి" అంది, ఆ పిల్ల తనూ చిరు నవ్వుతో. ఆవిడ ముఖాన బొట్టు లేకపోడం గమనించి, "దేవుడికి పెట్టండి అమ్మగారు" అంది, ఆ పిల్ల, అరుగుకు తన నడుము ఆనించి నుంచుంటూ.

పార్వతమ్మ నిమ్మళంగా తలుపు దగ్గరికి నడచి వచ్చింది.

తన చేతుల్లో ఉన్న మేకూ, రాయి వంగి, అతి నిదానంగా కింద పెట్టి, చెయ్యి కింద ఆనుక్కుంటూ కూచోబడింది, తలుపుని ఆనుక్కుని, ఎడమ చేత్తో కుడి చేతి దండ ఒత్తుకుంటూ.

"సరిగ్గా కూచో, అమ్మాయ్, నువ్వు కూడా" అంది ఆవిడ కలుపుగోలుతనంగా. ఆ అమ్మాయి నిమ్మళంగా పార్వతమ్మకు ఎదురుంగా కింద మెట్ల మీద కాళ్ల రెండూ వెనక్కి మడుచుకుని వినయంగా కూచుంది.

"ఇక్కడ చల్లంగా ఉందండి అమ్మగారు. ఇంత పొద్దు వాటారినా గాని ఇంకా వడగాడ్పు కొడతానే ఉందండి. దారంతా నేల ఆవిర్లు విడుస్తానే ఉందండి" అంది, ఆ పిల్ల చిరు నవ్వుతో.

"ఉండదటే మరి. చైత్ర మాసం గదూ. ఇక్కడ ఈ తామర చెరువు గాలి. ఈ మాత్రం చల్లగా ఉంటోంది. అంతే. మీ ఇంటో చల్లగా ఉండదా?' ' అడిగింది పార్వతమ్మ.

"మా ఇంట్లో చల్లగానే ఉంటాదండి. పూదోట గదాండి ... అమ్మగారూ, దండలు నెప్పొండి, ఆ విదంగా దండలు పిసుక్కుంటా ఉండారు?" అడిగింది ఆ పిల్ల భయం భయంగా, జాలితో.

"అవునే పిల్లా. ఒంటో బాగుండడం లేదు. గుండెల్లో ఏదో దోషం ఉందిట. బలహీనంగా ఉంటుంది. అసలు బరువు పనులు ఏవీ చెయ్యొద్దన్నారు డాక్టర్లు" అంది పార్వతమ్మ.

"అట్లా అయితే మరి ఎట్లాగండి .. ఇంట్లో పనీ ... గట్రా .. " అంది ఆ పిల్ల కాస్త నిదానించి, నిదానించి.

"ఆఁ, ఏమంత ఉందిలే, మహా. ఏదో కాస్త అబ్బాయి సహాయం చేస్తాడు - ఆఫీసుకి వెళ్లే వరకూ. ప్లస్ టూ పాస్ అయ్యాడు. అంతలో వాళ్ల నాన్న గారు పోయారు. అందు వల్లనే ఉద్యోగం చేస్తూ ప్రైవేటుగా బి.కామ్. చదువుకుంటున్నాడు' ' అం దావిడ.

"అయినా మీరు ఒంటరిగా ఉండాలి గదాండి - ఈ ఊళ్లో శుట్టా లెవ్వళూ లేరాండి - కాశంత అప్పు డప్పుడూ ఒచ్చి, ఆదుకునే దానికి?" అడిగింది, ఆ పిల్ల, అక్కరగా, కాస్త స్వతంత్రం తీసుకుని.

"ఈ ఊళ్లోనే కాదు, మరి ఏ ఊళ్లోనూ లేరు' ' అంది పార్వతమ్మ కాస్త చిరు నవ్వుతోనే.

"మరి?" అంది, ఆ పిల్ల, కాస్త నవ్వుతో.

"మరే ముంది? అనాథో దేవ రక్షకః - అంటారుగా పెద్దలు! దిక్కు లేని వాళ్లకి భగవంతుడే తోడు" అన్నా రావిడ.

"గట్లా మేకులు గీకులు కొట్టకండి అమ్మ గారు" అంది ఆ అమ్మాయి మనస్సు బాధతో.

"కొట్టక పోతే ఎల్లాగే పిల్లా? రాముల వారి పటం మేకు జారి కిందికి పడ్డది. అందుకని కొడుతున్నాను తిరిగి తగిలించడానికి" అంది ఆవిడ.

"అట్లా అయితే కొట్టేసి రండమ్మగారు. మరి గట్టా చేతులు నెప్పే అని అన్నాను, నేను. పోనియ్యి, రా మేకు నేనే కొట్టి తగిలిద్దామా అంటే, నేను ఇంటి లోపలికి రాకూడదాయె. నేను కొట్ట గలుగుతా" అంది ఆ పిల్ల ఆగి, ఆగి కాస్త సందేహిస్తూ.

"అదే! నీ ఇల్లు బంగారం గాను! నువ్వు ఇంటోకి వస్తే ఏం? అదేమిటి, నా కటువంటి చాదస్తపు ఆచారాలు ఏమీ లేవు. మా నాన్న గారు స్వతంత్ర పోరాటంలో జైలు కెళ్లారు. ఆయన త్యాగి. ఇల్లాంటి మూఢ నమ్మకాలు ఆయనకి గిట్టనే గిట్టవు. అసలు ఒప్పుకోరు. నువ్వు కొట్టి చూడు, రా" అంది పార్వతమ్మ లేస్తూ. ఆ పువ్వుల పిల్ల నిమ్మళంగా చెప్పుల్లో నించీ కాళ్ల తీసేసి ఇంటోకి అడుగు పెట్టింది.


"ఇదిగోనే అడ్డ గోడ. మట్టి గోడ. మేకు నిలవడం కష్టంగా ఉంది" అంది పార్వతమ్మ.

"అదేంటండి అమ్మ గారు, ఈ జేనెడు అడ్డ గోడ మట్టి గోడ అని ఇత బయపడుతుండారు. ఇయ్యన్నీ నాకు అలవాటే నండి అమ్మ గారు. మా ఇంట్లో అయితే లోన గోడలన్నీ మట్టి గోడలే నండి. చుట్టూతా ఉండేయన్నీ ఇటికి రాళ్ల గోడ లండి " అంది ఆ పిల్ల.

"అమ్మయ్య! పటం నిల్చిందే పిల్లా! బలే

సుతారంగా కొట్టావు మేకు. ఇంత వరకూ నా కెంత మనస్సు బాధ కలిగిందో తెలుసా? రాముల వారు మా ఇంటి దైవం. అందుకనే మా అబ్బాయికి కూడా వాళ్ల నాన్న గారు రాఘవేంద్రరావు అని పేరు పెట్టుకున్నారు" అం దావిడ పటం తగిలించి, తృప్తిగా.

బయటికి వచ్చి కూర్చుని, పువ్వుల జంగిడి ఒళ్లో పెట్టుకుని "అమ్మ గాం రూ, మీది పెద్ద మన స్సండి" అంది పువ్వుల పిల్ల.



# మట్టి గోడలు

ఎన్. కళ్యాణ సుందరీ జగన్నాథ్

"అదేమిటే. ఏమంత పెద్ద ఘన కార్య మయింది? అబ్బ ఎంత వాసనే పువ్వులు! ఎల్లా ఇస్తున్నావు అమ్మాయ్?" అడిగింది.

"ఎంత కేముంది లెండి! పొద్దు పోయింది. అన్నీ తీసేసుకోండి అమ్మ గారు!" అంది ఆ పిల్ల.

"ఇన్నా? ఇవ్వన్నీ నా కెందుకే?" అంది పార్వతమ్మ.

"ఎట్టాగా వాడి పోతాయండి. చూడ లేక దగ్గిర ఇళ్ల వాళ్లకి ఇచ్చి రమ్మన్నా డండి మా నాయన. వాడికగా తీసుకోండి. నెలాఖరికి మా నాయనకి డబ్బియ్యండి" అంది ఆ అమ్మాయ్.

"ఎంచక్కటి పువ్వులు బలే వాసన" అం దావిడ చేతి కిచ్చిన పువ్వులు ముచ్చటగా చూస్తూ.

"వాసు దేవాలయానికి పువ్వు లిచ్చేది మేమే నండి. "

"అల్లాగా!" అంది పార్వతమ్మ కాస్త ఆశ్చర్యంగా.

"ఈ సంవత్సరం తెగ పూసా యండి. మా నాయన గుళ్లో పువ్వు లిచ్చి వచ్చే సరికల్లా, తిరిగి తెల్లటి మొగ్గలు పైకి ఒచ్చి చూస్తా యండి. ఈ సంవత్సరం నే నొచ్చా నని నా కోసమే ఇట్లా తెగ పూస్తా వుండా యంటున్నా రండి మా నాయన" అంది ఆ అమ్మాయ్, కపటం లేని సంతోషంతో.

"అంఏటు, ఇన్నాళ్లూ ఇక్కడ లేవా? మరి ఎక్కణ్నించీ వచ్చావ్? అదే, నిన్ను ఇంత వరకూ ఎప్పుడూ చూడ లేదు అనుక్కుంటూనే ఉన్నా" అంది పార్వతమ్మ.

"నేను మా నాయనమ్మ దగ్గిరే ఉండి పోయా నండి - రామగిరి పాడులోనే" అంది ఆ పిల్ల.

"నీ పేరు?" అడిగిం దావిడ పువ్వులు చేతిలోనే పట్టుకుని.

"సిరి దేవి అమ్మ గారు" అంది.

"చక్కని పేరు. నువ్వు కూడా రా. దణ్ణం పెట్టుకో. దీపారాధన చేస్తాను" అంది పార్వతమ్మ, నిమ్మళంగా లేస్తూ.

"నువ్వు ఒక పాట పాడవే సిరి దేవి" అం దావిడ, పువ్వులు అలంకరిస్తూ దేవుడికి.

"నాకు ఇస్కూల్లో నేర్పిన పాటలే తప్ప వేరే ఏమీ రావండి అమ్మా!" అంది సిరి దేవి.

"చదువుకున్నావా? అదే అంటా. నాకూ నువ్వు మామూలు పువ్వుల పిల్లలా లేవే. గొంతూ అదీ అని తోస్తూనే ఉంది, ఇంత సేపూ" అంది పార్వతమ్మ, మిగతా పువ్వుల చేరు భర్త గారి పటానికి వేస్తూ.

"నేను 8వ క్లాసు మంచి మార్కులతో పాస్ అయ్యా నండి అమ్మ గారు" అంది సిరి దేవి తృప్తిగా చూస్తూ.

"మా నాన్నమ్మ గారు ఒక రింటికి వెళ్లే పిల్లకి చదువు ఎందుకు లేవే అంటూ నన్ను చదవ పెట్టనే లేదు. మా నాన్న గారా ఎప్పుడూ మీటింగులూ, జైళ్లూ. నాకు చదువు రాదు" అంది కాస్త మనోబాధతో, పార్వతమ్మ. దీపారాధన చేసి, "శ్రీరామా ... రామా ... అని పిలువ ...దశరథుడు తప మేమి చేసెనోయీ..." అని ప్రారంభించి, చక్కని సన్నని గొంతుతో ముగించింది.

"నాకు పాటలు కూడా నేర్ప లేదే సిరి దేవి ఎవ్వరూ. నా ఊహ, ఉపాయాలతో నేనే నేర్చుకున్నాను" అంది పార్వతమ్మ బయటి కొస్తూ.

"అమ్మా, అంత మన సిచ్చి పాడారే. ఎంత చక్కగా ... దేవతలే వచ్చా రేమో అనిపిచ్చేసింది నాకు."

"సరి పోయిందిలే. చీకటి పడుతూందే. నీకు ఆలస్య మయిపోయింది. మీ అమ్మ గాబరా పడుతుంది పాపం" అం దావిడ.

"నాకు అమ్మ లేదండి" అంది సిరి దేవి నిమ్మళంగా, ఖాళీ పువ్వుల శిబ్బి చేత పట్టుకుంటూ, కాస్త మనసు్సు బాధతో.

"ఏవన్నావ? నీకు అమ్మ లేదా? ఏం? ఏమయింది? చెప్పు" అడిగేసింది పార్వతమ్మ ఆత్రతగా.

"అసలు మా అమ్మ నన్ను నీళ్లాడినప్పుడే ఆమెకి కడుపులో ఏదో తొందర గలిగిందంట. ఆ మిస్టేకు సరి కా లేదండి కడశీ వరకూ. మా అమ్మ కాశంత అన్నం వండి మా నాయనకి పెట్టే వరకే గాని బలం రానే లేదంట. అది పోయి ఏడు మరీ ఎక్కువూ కడసీకి మా అమ్మనే తినేసింది. ఇక్కడికి తీసుకొచ్చి ఒదిలేసింది. నేను కూడా దగ్గర లేక పోతే మా నాయన అసలు పిచ్చి వాడు అయి పోతాడని అనుక్కున్నారు" అంది దీన స్వరంతో.

రెప్ప వెయ్యకుండా ఆలకించిన పార్వతమ్మ గారు "ఎవ్వరైనా మంచి తెలివైన డాక్టరుకీ, లేక పోతే ఏదైనా పెద్ద ఆస్పత్రిలో వేసి నట్టయితే మీ అమ్మ నీకు దక్కునేమోనే!" అంది గాఢ సానుభూతితో.

"పని ముట్లూ, ఆయుధాలు బాగా ఎక్కువగా ఉంటాయని పెద్ద ఆస్పత్రిలో వేసారు. మరి మా అదృష్టం, అమ్మా!" అంది.

పార్వతమ్మ "అంతేలే. మీరు తెచ్చుకున్నది అంతే!" అంది బరువుగా. "ధైర్యం తెచ్చుకోవాలి. చేసేదేమీ లేదు."

అట్టే నించోబడి పోయిన సిరి దేవి, "అసలు ఆస్పత్రులలో పని చేసే ఓళ్లకి రెండు కళ్లంటండి మా నాయనమ్మ చెప్పుతాది."

"అదేమిటే నీ ఇల్లు బంగారం గాను! మన కందరికీ రెండు కళ్లు పెట్టలే భగవంతుడు?" అంది ఆశ్చర్యంగా పార్వతమ్మ.

"అట్టా కాదండి అమ్మ గారు. గొప్ప ఓళ్లని శూట్టానికి ఒక కన్నంట. బీద ఓళ్లని శూట్టానికి ఒక కన్నంట. అందుకే ఎంత డబ్బు ఖర్చు పెట్టినా ఫలం ఉండ దంట" అంది సిరి దేవి.


"ఓస్ నీ ఇల్లు బంగారం గాను, ఇం కేమిటో అనుక్కున్నాను నేను! అదా సంగతి! అది నిజమే. అది ప్రపంచ లక్షణం. దాన్ని అరికట్టలేం మనం" అందిపార్వతమ్మ, చిరు నవ్వుతో.

"అమ్మ గారూ. మనం కబుర్లు చెప్పుకుంటూ ఉండాం, చీకటి పడిందండి. నేను వెళ్లి వస్తా నండి. పాపం మీరే ఒంటరిగా ఉండాలే". అంది సిరి దేవి.

"అదేం పరవా లేదు పిల్లా. అబ్బాయి వచ్చే వేళ అయిందిలే" అంది పార్వతమ్మ లేస్తూ.

00 00 00 00 00

విసుదు విసురుగా తోటలోకి వస్తూన్న సిరి దేవిని చూచి "ఏం అమ్మా, ఇంత లేటు?" అన్నాడు వాళ్ల నాన్న గోపాలం, ఇంటి అరుగు చివర కాళ్లు వేళ్లాడ వేసుకుని కూచుని, నోట్లో చుట్ట తీసేసి - "శానా లెక్క తిరిగి ఒచ్చినట్టు ఉండావు. మొదట కాస్సేపు కూచో" అన్నాడు.



"ఎక్కడికీ పోలేదు నాయనా. ఒక్క ఇంటోనే ఇంత సే పయ్యింది" అంది, జంగిడి అరుగు మీద పెట్టి తండ్రికి ఎదురుంగా రెండో అరుగు మీద కూచుంటూ.

"సరి పోయిందిలే. ఏరీ కోరీ వ్యవసాయం చేద్దామా అంటే కాడేమో దొంగ లెత్తి కెళ్లారంట. అట్లా ఉండాది. ఎప్పుడూ బయట కంపని పిల్లని బయటి కంపిస్తే మరి ఇట్టాగే..." అని ముచ్చటగా మొద లెట్టాడు, గారాబంగా.

"నాయనా! ఇటు పక్కగా తిన్నంగా వెళతా ఉంటే, ఒక చెరువు ఉండాది శూడు. దాని పక్కగా ఒక చిన్న కటకటాల పెంకుటిల్లు ఉండాదే..." అంది సిరి దేవి, పరిగెత్తుకుంటూ వచ్చి తన కాళ్లు సిరి దేవి ఒళ్లో పెట్టి ముఖం చూస్తున్న కుక్క టైగర్ తల నిమురుతూ.

"ఓహో! అదా అమ్మా, అది మాధవయ్య మాస్టరు గారిల్లే. ఆ తామర గుంట పక్కది" అన్నాడు గోపాలం.

"దాని పక్కనే ఒక పెద్ద మేడ ఉండాది శూడు..." అని తండ్రికి అడ్డు తగిలింది. "దానిలో నించీ ఒక సొగసుకాడు నన్ను చూచి ఈల వేసుకుంటూ పోయాడు నాయనా!' అంది సిరిదేవి విసుగ్గా.

"వా డెవడమ్మా సన్నాసోడు! ఇక్కడ పులిని నేనుండానని వాడికి తెలవదల్లే ఉంది. ఇంకా ఈ సారి నీ కంట్లో బడితే బొయికలు ఏరతానని శెప్పు వాడితో. అసలు ఆ ఇల్లు దుష్టపోళ్లది. మాధవయ్య మాస్టారు పెద దండ్రి గారిది. ఆ రెండిళ్లకీ అస్సలవదు. ఆ ఇంటి కాకి ఈ ఇంటి మీద వాలదు" అన్నాడు కాస్త ముఖం చిట్లిస్తూ. "మాధవయ్య గారు మహ పెద్ద మడిశి. ఉపకారి" పొడిగించాడు గోపాలం, చుట్ట నేల మీద రాస్తూ.

"నీకు తెలుసునా నాయనా వారు?" అడిగింది సిరి దేవి, సంతోషంగానూ, కాస్త ఆశ్చర్యంగానూ.

"అదేంటమ్మా అట్లా అడిగావ్? మనం ఈ ఏళ అన్నం తింటా ఉండాం అంటే, మనం తినే ఒక్క ఒక్క ముద్దా ఆ అయ్య గారు పెట్టిన బిచ్చమేగా!" అన్నాడు గోపాలం.

"అదెట్లా నాయనా? నా కిదేదీ తెలవలేదే?" అంది సిరి దేవి కుతూహలంగా.

"అదా? అసలు ఈ తోట మన తాతతండ్రుల దగ్గర నుంచీ మనకి మాన్యంగా వస్తా ఉండాదమ్మా. ఇది వాసుదేవాలయానిదే' ' అని మొదలు పెట్టాడు చెప్పడం, చుట్ట మళ్లీ ముట్టిస్తూ. "గుడికి మాధవయ్య గారి తాత గారు ఒక ట్రస్టీ వారు పోయాక ఆ పదవి పెద్ద కొడుకుకు వచ్చింది. చిన్న కొడుకు మాధవయ్య గారిని కని అకాలంగానే పోయారు. దానితో అతని ఒంతు ఆస్తి కూడా ఆయన వేసేసుకుని, అప్పులు చూపించి, మాదవయ్య గారిని పది క్లాసు వరకూ శదివిచ్చి, పెళ్లి శేసి, మాస్టారు ఉద్యోగం ఇప్పిచ్చి, ఒక అవుట్ ఔపు చిన్నది ఇచ్చి, వదిలేసారు" అన్నాడు గోపాలం.

"ఇంత తెలుసునా నాయనా నీకు?" అది సిరి దేవి ఆశ్చర్యంగా.

"ఇది అందరికీ తెలిసిందే తల్లీ! నన్నెంత శేసాడో తెలుసా? నేను శదువు రాని ఓళ్లని, ఇం కొకళ్ల దగ్గర లంచం తీసుకుని మన తోట వాళ్లకి ఇప్పిచ్చేసాడు. నేను పిచ్చి పట్టినట్లుగా దిగులు పడి పోయి, అన్నం నీళ్లు లేకుండా తిరుగుతా ఉంటే, మాస్టారు గారు ఒక సారి ఎదురై 'ఏం అల్లా ఉన్నావు? ఏం జరిగింది? చెప్పు గోపాలం!' అని అడిగారమ్మా. దుఃఖం పొంగు కొచ్చింది. అంతా చెప్పేసాను. అంతే. నా భుజం తట్టి 'భయ పడకు' అన్నారు.


అద్భుతమైన సౌందర్య ఫలితాలు
మొదటి రోజే!



**కంప్యూటర్ ద్వారా స్లిమ్మింగ్ :** అత్యంతాధునికమైన కంప్యూటరైజ్డ్ యూరోపియన్ టెక్నిక్ ద్వారా 15 రోజులలో **7 కేజీలు మరియు 15 అంగుళాలు** వరకూ తగ్గింపును పొందండి. ప్రారంభించిన **మొట్టమొదటి రోజే 15 నిమిషాల్లో 3 అంగుళాల వరకూ తగ్గింపును పొందండి.**

**మొటిమలు, మచ్చల నివారణ మరియు చర్మ సౌందర్యము చికిత్స:** ఆధునిక యూరోపియన్ నాన్ సర్జికల్ పద్ధతి ద్వారా మొటిమలు, ముడతలు, శరీరపు నలుపుదనము, గాట్లు, తెల్లమచ్చలు, చారలు, కంటి చుట్టూ నలుపుదనం, అవసరం లేని చోట జుట్టు మొదలగు బాధలనుండి సత్వర విముక్తి. అంతేగాక వక్షోజాల ఎదుగుదల, పెరుగుదల, పటుత్వము మరియు ముఖమును అందముగా తీర్చిదిద్దుట.

**ఎత్తు పెరిగించుట:** ఎటువంటి మందులూ, చికిత్స లేకుండానే కొన్ని నెలల్లోనే 3 అంగుళాలు పెరగండి.

**ఇతర విశేషాంశములు**

- **శాశ్వతమైన కాస్మెటిక్ మేకప్,** లిప్‌స్టిక్, కనుబొమలు మరియు నల్ల పెదవులకు చికిత్స.
- **పులిపిరికాయులు, పుట్టుమచ్చలు, మచ్చలకు శాశ్వత నివారణ.**
- తెల్లమచ్చల నివారణ కేవలం ఒక రోజులోనే!

మీ బట్టతలను తొలగించుకోండి

**హెయిర్ వీవింగ్**

మాయొక్క నాన్ సర్జికల్ - హెయిర్ వీవింగ్ కార్యక్రమం ద్వారా కేవలం 3 గంటలలో మీ బట్టతల మటుమాయం. హెయిర్ వీవింగ్ తర్వాత మీరు దువ్వుకోవచ్చు. రంగు వేసుకోవచ్చు. బ్రష్ చేసుకోవచ్చు.

**ఇప్పుడు రూ. 4,500/- మాత్రమే**



ముందు



తరువాత

**అమెరికన్ హెయిర్ బాండింగ్ సిస్టమ్**

అద్వితీయమైన ఈ పద్ధతి మీ బట్టతలను మటుమాయం చేస్తుంది కేవలం ఒకే ఒక గంటలో! తదుపరి చికిత్స ఎంత మాత్రం అవసరం లేదు.

Innovative Cure
HEALTH & BEAUTY CLINIC
FOR WOMEN & MEN
5-9-30/6/B, 2nd Floor, Prashanti Complex, Opp. Gandhi Medical College. Basheer Bagh, Hyderabad-500 029. Tel: 234711.
**Mumbai:- JUHU:** Tel: 6185441/6124573/6163609/6160032.
**CHURCHGATE: Asiatic Tel:** 2872815/16
**BORIVLI:** Tel: 8612478/8081492. Pune: Tel: 321924/322871
**Beirut (Lebanon), Mumbai, Delhi, Bangalore, Indore, Surat, Pune and Hyderabad.**

ఇకనంతే. ఆయన నన్ను ఎంట బెట్టుకుని ఎక్కని ఆపీసు లేదు, దిగని ఆపీసు లేదు. అర్జీల మీద అర్జీలు కొట్టేసారు. అంతా వారే చూసుకున్నారు. ఆ మారాజు ఈ తోట మల్లా నాకు ఇప్పిచ్చేసాడు. శచ్చి ఏ లోకంలో ఉండారో శల్లగా ఉండాల. ఇయాళ మల్లా అన్నం తింటూ ఉండాం'' అన్నాడు తృప్తిగా చుట్ట ముట్టిస్తూ.

"ఇంత నాకు తెలియనే తెలియదు నాయనా. అమ్మ గారు కూడా శానా మంచోరు'' అంది సిరి దేవి సంతోషంగా.

"నేను రేపు ఎల్లి ఆయమ్మ గారికి ఒక దణ్ణం పెట్టుకుని వస్తాను'' అన్నాడు గోపాలం.

"అదేంటి నాయనా, ఒక్క సారి దణ్ణం పెట్టుకుని వచ్చేస్తే నీకు మనస్సు నెమ్మది అవుద్దే గాని ఆ అయ్య గారికి ఏంటి లాబం? ఆయన మనకి ఎంత చేసారు? ఆయమ్మ కష్టానికి మనం అవ్వద్దా?'' అడిగింది సిరి దేవి పాలు తీసుకుని కాయడానికి లోపలికి వెళుతూ.

"పెద్ద మాట శెప్పావమ్మా. అదీ నిజమే. నిన్ను చదివించింది మంచి దయింది'' అన్నాడు గోపాలం తృప్తిగా.

"అసలు ఇన్నాళ్లు నువ్వూ ఎందుకు చూడ లేదు నాయనా, వారిని?'' అడిగింది, అకస్మాత్తుగా ఆలోచన తట్టి, గుమ్మంలోనే ఆగి పోయి. "అదా అమ్మా? మీ అమ్మకి తీరని జబ్బు చేసింది. అపుడు నాకు పిచ్చి పట్టుద్దనుకున్నా. ఒక దుష్ట అలవాటు చేసుకున్నా కదా! తాగినోడు అంటే వారికి అసయ్యం ఏసుద్దని నేను ఎల్లలే. మొకం చెల్ల లేదమ్మా'' అన్నాడు అతను. సిగ్గుగా చిరు నవ్వుతో "బయపడ్డాను'' అన్నాడు దిరిగి.వెంటనే కాస్త అలకిస్తూ, "అమ్మా, మొదట నెల్లి గాడికి అన్నం పెట్టెయ్యి. అదిగో దూడతో ఆడతా పాటలు పాడతా ఉండాడు. అన్నం మరిచి పోతాడు. మొదట వాణ్ని తీసుకుని వస్తాను. మనం అన్నీ సావకాశంగా మాట్లాడుకుందాం'' అంటూ టైగర్‌తో పాటు సావిడి కేసి బయలుదేరాడు.

పువ్వు లిచ్చి సిరి దేవి వెళ్లి పోయాక, ఇహను చేసేదేమీ లేక పార్వతమ్మ గుమ్మంలో కొడుకు కోసం ఎదురు చూస్తూంది. కాస్సేపట్లో రాఘవేంద్ర రావు తెల్ల చొక్కా, తెల్ల పైజమాతో, చేతి సంచీతో గేటు తెరుచుకుని రానే వచ్చేశాడు. పార్వతమ్మకు కడుపు నిండినట్టు అయింది. కొడుకు వచ్చేశాడు. తన ప్రపంచంలో ఏ కొరతా లేదు ఇహను. వస్తూనే "అమ్మా! సాయంత్రం టీ అయినా తాగావా? ఒళ్లు ఎల్లా ఉంది? ''అడిగాడు, చేతిలో తోలు బాగ్ అమ్మ చేతికి ఇస్తూ.

"నిక్షేపంలా ఉన్నానురా. నాకేం కొరత? నువ్వేమన్నా టిఫిన్ తిన్నావా?'' అడిగింది పార్వతమ్మ ప్రేమతో.

"ఓ, తిన్నాను. బోండాలు. ఇందులో నీ కిష్టమైన తొక్కుడు లడ్డూలు, నాలుగు మామిడి పళ్లూ ఉన్నాయమ్మా. జీతం కవరు ఇదిగో'' అంటూ జేబులో నించి కవరు కూడా తీసి చేతి కిచ్చాడు. చెప్పులు తీసేసి అమ్మకి దగ్గరగా అరుగు మీద కూచున్నాడు. చటుక్కున "ఎక్కడమ్మా చక్కని మల్లి పూల వాసన? మన ఇంటో నించే? దేవుడికీ, నాన్నకీ పెట్టావా? కొన్నావా?''అన్నాడు వంగి ఇంటోకి చూస్తూ, ఆత్రుతగా.

"ఒక పువ్వుల పిల్ల తెచ్చి ఇచ్చిందిరా'' అంటూ లేచి వంటింటోకి వెళ్లిం దావిడ కఫీ తేవడానికి.

"అప్పు బరువై పోతుందేమోనన్న భయమే నమ్మా నాకు, ఒక పక్క. నీకు ఆపరేషన్ అయ్యే వరకూ నాకీ జాగ్రత్త. ఆ తరువాత మనకి ఢోకా లేదు. నిశ్చింతగా బతక వచ్చు'' అన్నాడు.


"ఇప్పు డేమి అవసరంరా దానికి?'' అం దావిడ. "దిగులు పడకు'' అని పొడిగించింది.

కాస్సే పయ్యాక స్నానం చేసి భోజనానికి ముందు మామిడి పళ్లు తరుగుతూ "పోనీ గుప్తా గారినే అప్పడుగుదామా అంటే, నేను పనిలో చేరి శానా నెలలు అవ లేదు గదా! పైగా ఆ మొత్తం ఆయనకి ఎక్కువగా కనిపించ వచ్చు. లాభాలూ అట్టే లేవు. ఇంకా ఇన్‌కంటాక్స్ కట్ట లేదు. ఒక సంవత్సరం జీతం వెనక వేసుకుని అప్పుడు ఆపరేషన్ అనుక్కుం టున్నానమ్మా'' అన్నాడు రాఘవుడు.

"నువ్వు ఏ అలోచనలూ పెట్టుకోబోకు తండ్రీ. పరీక్షకు చదువు. ఇంత వరకు భగవంతుడు ఈ మాత్రం నీరు పోస్తున్నాడు. అది చాలు'' అంది పార్వతమ్మ అన్నాలు వడ్డిస్తూ.


ఆ రాత్రి అమ్మ సర్ది పక్క వేసిన మంచం మీద పడుక్కుని పుస్తకం తెరిచాడు రాఘవేంద్ర రావు. ఎదురుంగా మంచం మీద పక్కకు తిరిగి పడుక్కుంది అమ్మ. పుస్తకం మీదికి పోవడం లేదు మనస్సు. ఏవేవో ఆలోచనలు రాసాగినాయి. అమ్మ ఒళ్లో తల పెట్టుకుని పడుక్కుని ఎన్నా ళ్లయిందో! అమ్మకి ఏ మాత్రమూ ప్రయాస ఇవ్వ కూడ దన్నారు డాక్టర్లు. ఆఫీసులో ఇవ్వాళే ఇన్‌కంటాక్స్ వాళ్ల దగ్గర నించీ అన్ని కాయితాలూ ఈ నెల్లో తెచ్చి ఇవ్వమని ఉత్తరం ఒకటి వచ్చింది. అవ్వన్నీ వెంటనే పూర్తి చేయ మన్నారు గుప్తా గారు. ఇంతా యంపలు దంపలు చేసుకుని చెమటోడ్చి రాస్తే, ఒక్క చిల్లి గవ్వ అయినా ఎక్కువ ఇస్తాడా అంటే అదీ లేదు. ఇంకో ఉద్యోగం చూచుకుంటేనో? అన్నట్టూ ఈ వేళ ఆ కాఫీ హోటల్లో ఆ పెద్ద మనిషి చెప్పిన మాట. అదీ బాగానే ఉంది. నా కాఫీ, టిఫిన్ బిల్లు కూడా ఆయనే ఇచ్చేశారే, ఎంత ధనికుడో! ఎన్ని ఉంగరాలు వేళ్లకి! అబ్బ! నా టేబిలు దగ్గరే కూచున్నా డాయన. ఓ నెల నించీ హోటల్లో దారిలో అప్పు డప్పుడు కనిపిస్తూనే ఉన్నా డాయన. ఉపకారి. సాయంత్రం గుప్తా గారి ఆఫీసు పని అయిన తరువాత, ఒక గంట ఆయనకి పని చేస్తే, ఆయన కంటే చాలా ఎక్కువ ఇస్తా నన్నాడు. చాలా దయగా మాట్లాడాడు. నాలుగు పిక్కలు ఇప్పుడే వెనక వేసుకోవాల అని సలహా కూడా ఇచ్చాడు. నిజమే. ఆయన చెప్పింది మంచి మాటే. ఆ పనీ ఈ పనీ కూడా చేస్తే ఒళ్లు పాడవు తుందని అమ్మ ఒప్పుకోదే! ... అల్లా కళ్లు మూతలు పడ్డాయి.

మరు నాడు రాఘవుణ్ని ఆఫీసుకి పంపిన తరువాత నిమ్మళంగా అంట్లు నూతి కింద వేసి తడపడానికి గుడ్డలు తీస్తున్నది పార్వతమ్మ. ఒక



**సాహస బాలలు - 4**

# బందిపోట్లను తరిమికొట్టిన సాహసి దులాల్‌దాస్



గత సంవత్సరం ఫిబ్రవరి 19న పశ్చిమ త్రిపురలోని బాగ్బేర్ గ్రామంలో సుమారు 15మంది బందిపోట్లు చొరబడి ఆ గ్రామాన్ని దోచుకోడానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో వారిలో కొందరు ఆ ఊరిలోని మనోరంజన్‌దాస్ ఇంటిపై దాడిచేసి ఆయనను, అతని సోదరుడిని తీవ్రంగా గాయపరచడమే కాక, ఆయన మేనమామ హీరాలాల్‌దాస్‌ను చంపేశారు కూడా. ఆ పక్కనే మనోరంజన్‌దాస్ చిన్న తమ్ముడు పదిహేనేళ్ల దులాల్‌దాస్ (బాపు గయాధని అవార్డు గ్రహీత) నిద్రిస్తున్న గోశాలలోకి చొరబడ్డారు. తలుపు తెరుచుకున్న శబ్దానికి దులాల్‌దాస్‌కు మెళకువ వచ్చింది. ఆ దుండగులు ఆ బాలునిపైకి లంఘించి అతనిని ఒక తాడుతో కట్టివేయడానికి ప్రయత్నించారు. అయితే తమ కేం కావాలో అవన్నీ తీసుకుని తనను మాత్రం ప్రాణాలతో విడిచెపెట్టమని ప్రాథేయపడ్డాడు దులాల్‌దాస్. చేతికి దొరికినవి తస్కరించి, దులాల్‌దాస్‌ను మాత్రం వదిలిపెట్టి, మరికొన్ని ఇళ్లను దోచుకోడానికి వెళ్లిపోయింది ఆ బందిపోట్ల బృందం.

అంతలో వెనుకనుంచి దులాల్‌దాస్ ఒక ఇనుప కడ్డీని తీసుకుని వారిని వెంబడించి ఆ గుంపులో ఒకడి మెడమీద గట్టిగా కొట్టి గాయపరిచాడు. పట్టు వదలని దులాల్ ఆ కడ్డీతో మరో ముగ్గురు దోపిడీగాళ్లను బాది, వాళ్లను కూడా తీవ్రమైన గాయాలకు గురిచేశాడు. ఆ కలవరానికి, బందిపోట్ల అరుపులకు గ్రామస్తులంతా మేల్కొని సంఘటనా స్థలికి చేరుకున్నారు. అది పసిగట్టిన ఆ దోపిడీ ముఠా వారి తుపాకులను, మందుగుండు సామగ్రిని అక్కడే జారవిడిచి బతుకుజీవుడా అనుకుంటూ ఆ చీకటి ముసుగులో పలాయనం చిత్తగించారు.

మాస్టర్ దులాల్ చూపిన అసమాన ధైర్య సాహసాలు, సమయస్ఫూర్తి వలన సాయుధులైన బందిపోట్ల బారినుండి ఆ గ్రామస్తులంతా తప్పించుకోగలిగారు.

Ⓟ అనిపెద్ది వెంకట రమణరావు

---

జాము పొద్దు ఎక్కింది.

"అమ్మ గారూ, మా నాయన ఒచ్చా డండి" అంది సిరి దేవి గుమ్మం దగ్గర.

పార్వతమ్మ వెనక్కి తిరిగి చూచి, నవ్వు ముఖంతో చేతిలో గుడ్డలతోనే, గుమ్మంలోకి వచ్చింది.

"అమ్మ గారూ, దణ్ణా లండి" అన్నాడు గోపాలం, రెండు చేతులూ జోడించి.

"నమస్కారం" అరుగు చూపించి, ఇల్లా కూచోండి ఇద్దరూ" అన్నది పార్వతమ్మ, తనూ తలుపు నానుక్కుని కింద కూచుంటూ. తండ్రీ, కూతురూ, గుమ్మం కింద మెట్ల మీదనే కూచున్నారు సర్దుకుని. పార్వతమ్మకు ఎదురుంగా "పరవా లేదు లెండి"అంటూ.

"నిన్నెక్కడో చాలా సార్లు చూచినట్టుందయ్యా' ' అన్నది పార్వతమ్మ, ఆలోచనగా.

"మరే నండి అమ్మా. నా పేరు గోపాలం అండి. అమ్మ గారి చేతి కాఫీ, ఈ అరుగు మీదనే నేను నెన్ని సార్లు తాగానో నాకే లెక్క రాటంలే" అన్నాడు గోపాలం.

"అన్నీ మన రోజు లవుతయ్యా మరి?" అం దావిడ.

"ఈ అరుగుల నిండా సరస్వతి నాట్యం చేస్తా ఉండాదండి. ఎంత మంచి బీద సాదలకి అయ్య గారు ఫ్రీగా ట్యూషన్లు చెప్తా ఉండే ఓరండి! మాకు అదృష్టం లేదు లెండి. వారు గనక బతికే ఉండే ట్టయితే సిరి దేవిని ఎస్.ఎస్.ఎల్.సి.పరీక్షకి కట్టిద్దురు. ఇంక ఇప్పుడు ఏంవనుకుంటే ఏం లాబం లెండి! దొంగలు బడ్డా ఆరు నెలలకి కుక్కలు మొరిగిన య్యంట. అయ్య గోరు నన్నొంట పెట్టుకుని తిరిగి తిరిగి నన్ను గట్టెక్కిచ్చా రండి'' అన్నాడు గోపాలం ఏక ధాటిగా. "ఉండండి అమ్మ గారు" అంటూ చటుక్కున గోపాలం లేచి విసురుగా గేటు దగ్గరికె వెళ్లి తన సైకిల్ హేండిల్ బార్‌కు తగిలించిన ప్లాస్టిక్‌బాగ్ తెచ్చి, అమ్మ గారి ముందర పెడుతూ, "అమ్మా, ఇందులో బుడ్డి చెంబుతో పాలు ఉండా యండి, కాశిని. నాలుగు బెండ కాయలు కూడా ఉండా యండి. ఇయ్యి కాస్త లోపల పెట్టిచ్చండి'' అన్నాడు వినయంగా.

"ఎందుకయ్యా ఇవ్వన్నీ?" అందిపార్వతమ్మ మందలించినట్టు.

"అమ్మా, ఏడాకుల బెండండి. ఇప్పుడు వానా రాటంలే. నాటు కాయ మాయి రుశి అండి'' అన్నాడు గోపాలం.

"అల్లాగా? పొద్దున్న అబ్బాయి పాలు తెచ్చాడు గదా" అంది పార్వతమ్మ.

"అబ్బాయి గారితో ఇంక మీదట పాలు తేఒద్దని శెప్పండి. మా బుర్రావు తోటలో పచ్చ గడ్డి తిని బాగా పాలిస్తా ఉండా దండి,, మీ అసువంటి పెద్దోళ్లకీ, మాకూ వాడికలకీ కూడాసరి పోతాయండి. పాదులు పెట్టా నండి. కూరాకులు కూడా అబ్బాయి గారిని కొనొద్దని చెప్పండి అమ్మ గారు" అన్నాడు గోపాలం.

"ఎందుకయ్యా మా ఇద్దరికీ ఎన్ని కావాలి. నువ్వెందుకు శ్రమ పడతావు ఇట్లా?"అంది ఆవిడ మళ్లా.

"అందుకే నండి అమ్మా, ఆ కాసిని పాలు, రెండు కూరాకులు బయట ఎందుకు కొనాల అనేనండి. కావలిస్తే అబ్బాయి గారు పట్నం పుచ్చుకుని పెద్ద శదువులు శదివి పెద్ద ఉద్యోగస్తు డయ్యాక నాయననే డబ్బిచ్చి కొనమనండి. మొదట శదవమనండి, అబ్బాయి గారిని. ఇంక ఏ మాటా ఒద్దాయనికి. ఇంటి పనంతా నేను శూసుకుంటాను.రేషన్ను, పించనూ, మందులూ, ఆ బయట పనంతా నాకు ఒదలండి.పాలిచ్చి ఒచ్చాక నా కింకే పనీ లేదు. తోటలో కూసోటమే. ఇంక పాసి పని అంటారు - అది సిరి దేవికి ఇదలండి. అమ్మ గారు. మాయి సుబ్బరం అండీ. మమ్మాయికి మీకు ఒంట్లో బాగుండటం లేదంట. సిరి దేవి అంతా శెప్పింది లెండి ...'' అంటూ ఉండంగా,

"పాచి పని ఎంత పనయ్యా ఇద్దరి ప్రాణానికి?' ' అడ్డు తగిలింది, పార్వతమ్మ. "పైగా నాకేమీ పెద్ద జబ్బు కాదుగా. తిరుగుతున్నాను గదా" అంది తిరిగి.

"ఆ గుండెల్లో జబ్బులు పని ఎక్కువ చేస్తే జాస్తి అవుద్దండీ. ఇంతకీ సిరి దేవికి ఏమీ పని లేదరండి. ఒంటరిగా ఆ తోటలో ఒక్కత్తే పడి ఉంటాదండి. మీ బోటి పెద్ద దిక్కు కూడా మాదా ఉంటే దాని క్యూడా బుద్ది మలి ఎక్కువవుతాది గదాండి. పైగా అది మా ఋణం గదాండి. ఎంతో చెయ్యాలని ఉండా దండి నాకు...'' గుక్క తిప్పకుండా అనేశాడు గోపాలం.

"అయ్యొయ్యో! '' అం దావిడ అడ్డు

తగులుతూ.

"మీరు ఒద్దని మాత్రం అనకండి అమ్మ గారు" అన్నాడు గోపాలం. వెంటనే "అమ్మా సిరి దేవీ! ఆ నూతి దగ్గర ఉన్న పప్పు గిన్నె, కళాయి, గట్రా అన్నీ సుబ్బరంగా తోమేశెయి. గుడ్డలన్నీ బాగా గుంజి జాడిచ్చి ఆరేశెయ్యి. బక్కెట్లన్నీ కడిగి నీళ్లు తోడి నింపెయ్యి" అన్నాడు.

"సరే నాయనా" అంటూ నవ్వు ముఖంతో లేచింది సిరి దేవి.

"నువ్వు తోటలో పని అవ్వంగానే వచ్చెయ్యి ఇక్కడికి. పొద్దున్నా, సాయంత్రమూ. ఇక్కడ అమ్మ గారికి అన్ని పనులూ చేసి మరీ తోటకి రా తెలిసిందా?" పొడిగించాడు గోపాలం.

"అమ్మ గారూ! రేపు నేను వచ్చి అబ్బాయి గారితో సెప్పుకుంటా లెండి. నే నిక్కడికి వస్తా ఉండే రోజుల్లో బాబు చిన్నాయనమ్మా" అన్నాడు చిరు నవ్వుతో.

ఆ సాయంత్రం రాఘవుడు ఆఫీసు నించి వచ్చి, అమ్మ చేతి కాఫీ వంగి అందుకోబోయి నట్టింట్లో శిబ్బిలో బెండ కాయలు చూచి, "అమ్మా, అన్ని బెండ కాయలు ఎందుకమ్మా కొన్నావు?" అని అడిగాడు, కాస్త ఆశ్చర్యంగా.

"అయ్యో! ఏం చెప్పమంటావురా. పొద్దున్న ఆ పువ్వు లమ్మాయి, వాళ్ల నాన్న గోపాలం వచ్చారు. మనం అంతా అతనికి బాగా తెలుసుట" అని మొదలెట్టి జరిగిన దంతా చెప్పింది. "నాకు ఊపిరాడ నిస్తేనా? ఎంత చెప్పినా వినలేదురా. నాకు డొక్కాపిక్కాడ లేదు. అసలు నన్ను మాట్లాడనిస్తేగా. కాని ఎంత మంచి వాడో అతను'' అంది అమ్మ.

"ఈ గోపాలం గారు నన్నే ఆయనకి, ఋణగ్రస్తుణ్ని చేస్తున్నాడే!" అన్నాడు చిరు నవ్వుతో. కాఫీ తాగుతూ రాఘవుడు - కాస్త మనస్సు బాధతో.

"సరి పోయిందిలే. వాళ్లే మీ నాన్న గారికి ఋణగ్రస్తులమని గదా వా ళ్లంటున్నది. ఇంతకీ నీతో రేపు పొద్దున్న వచ్చి మాట్లాడతాడుటలే గోపాలం" అంది అమ్మ.

"రేపా? రేపు నే లుండదమ్మా. ఆఫీసులో చాలా లెక్కలు గవర్నమెంటుకు అప్పజెప్ప వలసినవి ఉన్నాయి. అవి అత్యవసరం అని, కొన్నాళ్ల పాటు నన్ను చీకటితోనే ఆఫీసుకు రమ్మన్నారు గుప్తా గారు. అది నీకు కష్టం కదా అమ్మా అనే ఆలోచిస్తున్నాను" అన్నాడు అబ్బాయి.

"అదేమీ కష్టం లేదురా నాకు. పొద్దున్నే లేచి రేపు చపాతీలు చేసేస్తాను. ఎ బెండ కాయ కూర, పప్పు అన్నం కట్టేస్తాను. చపాతీలలో మాగాయ పెడతాను" అంది అమ్మ సంతోషంగా.

"మరి పాపం గోపాలం గారు...?" అడిగాడు.

"దానికేమీ భయం లేదురా. మనిషి చాలా మంచి వాడు. నేను జరిగిన దంతా చెబుతాను. వింటాడు. నిన్ను ఇంకో రోజు చూస్తాడులే ఈ పనుల హడ్డడీ అవనియ్యి" అంది పార్వతమ్మ.

"అమ్మా, ఈ సమయానికే ఆ గోపాలం గారు సహాయం చేయ్యటం మన అదృష్టం. లేకపోతే ఈ పనులు ఇల్లా మీద పడినందు వల్ల కాళ్లు, చేతులు విరగ్గొట్టుకుందును" అన్నాడు రాఘవుడు తృప్తిగా.

"మంచి కుటుంబంరా వాళ్లు. అలారమ్ నాలుగున్నర గంటలకే పెట్టు రాత్రికి. ఇప్పుడు స్నానం చేసిరా. పెందలాడే నిద్ర పో. పని ఎక్కు వ గదా మరి!" అంది అమ్మ.

Ⓟ ముగింపు వచ్చే వారం




**కథనం:**

అ) ... అప్పుడు ఆదిభట్ల నారాయణదాసుగారు - "వెర్రినాయనా! నేను మాత్రం గోవులాంటి వాణ్ణి కానా?" అన్నారు.

పశుగ్రాసం విషయంలో లాలూప్రసాద్ యాదవ్ గారిని నిలదీస్తే ...??!

**నిర్-వచనం:**

ఆ) గొంగడి కప్పినవాడల్లా గద్దర్ కాడు.

**వచనం:**

ఇ) స్టీరింగ్ కమిటీ సమావేశంలో నూతన మంత్రివర్గం జాపితా ఖరాబు!

... ఇంతేకాదు; ఇంకా ఇలాంటి ఉ, ఊలతో ఎ, ఏలతో ల...క్షణంగా జోకులతో, షాకులతో వారం వారం మీ కోసం

**త్వరలో ప్రారంభం...**

**తెల్లవారు జాము అలారమ్ శబ్దానికి పార్వతమ్మ లేచి, స్నానం చేసి దీపారాధన చేసుకుని, పెద్ద గదిలో లైటు వేసింది, బెండ కాయల కోసం. ఆ లైటు వెలుగులో బైట కిటికీలో తళతళ లాడుతున్న కంచు బుడ్డి చెంబు నిండా గోరు వెచ్చని నుగర కమ్మిన పాలు కనిపించినయి. 'నిద్రలు భిన్నం కాకూడదని గాబోలు గోపాలం, నిశ్శబ్దంగా పాలు పెట్టేసి పోయాడు' అనుక్కుంటూ, అవ్వి కూడా తీసుకుని వంటింటోకి వెళ్లింది.**

# మట్టి గోడలు

## ఎన్. కళ్యాణ సుందరీ జగన్నాథ్

(కిందటి సంచిక తరువాయి)

జాడ వెలుగులు రాక ముందే రాఘవేంద్ర రావు ఆఫీసుకి బయలుదేరాడు.

అమ్మ వంటింటో సామాన్లు సర్ది పెట్టే సరికల్లా, తోటలో పని ముగించుకుని సిరి దేవి వచ్చేసింది.

ఒక వారం గడిచింది. పార్వతమ్మకు ఏమీ పని లేక పోయింది, వంట తప్ప. అబ్బాయి ఆది వారాలు కూడా ఆఫీసుకి వెళ్ల వలసి వస్తోంది.

ఆ నాటి సాయంత్రం రాఘవేంద్రరావు ఆఫీసు నించీ వచ్చే టప్పటికి పిండార పోసినట్టూ వెన్నెల. గేటు దగ్గర నించీ ఇంటి గుమ్మం వరకూ కళ్లాపు చల్లిన తడి ఇంకా ఆరలే. ఆ తడి నేల మీద వరసగ్గా దగ్గర దగ్గరగా పెద్ద పెద్ద ముగ్గులు వేసి ఉన్నాయి, ఆ వెన్నెల వెలుగులో నల్లటి తడి నేలలో తెల్లటి ముగ్గులు చూస్తూంటే, మనస్సు ఉప్పొంగి పోయింది. ఇంటికి వస్తూనే, "అమ్మా, ఇల్లంతా కలకల లాడుతూందే - ఏదో పండగలాగు" అన్నాడు.

అమ్మ వంటింటో నించీ వస్తూనే "ఈ వేళ పౌర్ణమి కదుటరా. ఆది వారం కూడానా, సిరి దేవి పండగ చేసింది.గోధుమ రవ్వ పాలతో ప్రసాదం చేశాను" అంది.

"అమ్మా, నువ్వు బాగున్నప్పుడు, నాన్న గారున్న రోజులు జ్ఞాపకం వస్తున్నాయి" అన్నాడు పంచీ మేజా మీద పెడుతూ.

"ఇప్పుడు సిరి దేవి ఉంది గదుటరా చెయ్యడానికి. అబ్బ!. దాని చేతులు ఏం తిరుగుతాయిరా బాబూ. వేసిన ముగ్గు వెయ్యదు. వేళ్లు మహ నిపుణం. ఉండు కాఫీ తెస్తాను" అని వెళ్లింది లోపలికి తిరిగి.

రోజులు గడిచినట్టే తెలయడం లే. గడుస్తూనే ఉన్నయి. ఒక నాటి సాయంత్రం సిరి దేవి పని అంతా ముగించుకొని తన ఇంటికి బయలుదేరింది. పార్వతమ్మకూ ఏమీ తోచటం లేదు, ఆ రోజు. ఆ మాటా ఈ మాటా చెబుతూ సిరి దేవితో పాటు గేటు వరకూ నడిచి వచ్చింది, కబుర్లతో. "చాలా పొద్దు పోయిందే పిల్లా" అన్నది గేటు ముందర ఆగి.

"మరే నండమ్మా" అంటూ రెం డడుగులు ముందర కేసింది, నిమ్మళంగా. ఒక్క క్షణం అల్లాగే ఆగి వెనక్కి తిరిగి "అమ్మా, మీరు లోపలికి వెళ్లండి" అంది బతిమాలినట్లు.

"అదేమిటి? ఏం?" అంది పార్వతమ్మ ఆశ్చర్యంగా. ఆవిడ కేమీ అర్థం కాలేదు.

"మీ రిక్కడ నుంచుంటే మిమ్మల్ని ఒదిలి నేను వెళ్ల లేను" అంది సిరి దేవి.

పార్వతమ్మ ఆనందమూ, తృప్తీ తొణికిస లాడుతూ, చిన్న గా నవ్వు ముఖం పెట్టింది. "ఎంత మెత్తని గుండే పిల్లా నీది! " అనుక్కుంటూ, నిమ్మళంగా వెనక్కి తిరిగింది 'ఇటువంటి పిల్ల తల్లికి నోచుకోలేదు' అని మనస్సులో అనుక్కుంటూ, బాధగా.

ఇల్లా చల్లగా ఓ వారం పది రోజులు గడిచాక, ఒక నాడు గుళ్లో ఉత్సవాలు జరుగుతూన్నాయి. భోజనా లయ్యాక సిరి దేవిని సైకిల్ మీద వెనక ఎక్కించుకుని, గోపాలం గుడికి బయలుదేరాడు. తిరుగుళ్లూ, తతంగాలూ. సేవలూ వగైరా అయ్యే టప్పటికి, అక్కడే 11 గంట లయ్యింది రాత్రి. "ఈ ప్రసాదం అమ్మ గారిని లేపి వారింటో ఇచ్చి మరీ వెళదా మమ్మా" అన్నాడు గోపాలం.

ఇద్దరూ సైకిల్ ఎక్కి పార్వతమ్మ ఇంటికి బయలుదేరారు. ఇంటికి కాస్త సమీపానికి వచ్చేటప్పటికి, "అదేమిటి నాయనా, అమ్మ గారి ఇంట్లో ఇంకా దీపం ఉందే? అదిగో గుమ్మంలో వెలుగు" అంది ఆశ్చర్యంగా సిరి దేవి. ఒక్క నిమిషంలో ఇంటి దగ్గరకి వచ్చే టప్పటికల్లా పార్వతమ్మ గొంతు వినిపించింది -గాభరాగా. గట్టిగా.

"ఏం చెయ్యను, ఎక్కడి కెళ్లను? ఎక్కడ వెతకను? ఎవ్వరితో చెప్పను? అయ్యో, తల కొట్టుకు పోతూందే! దైవమా, వాడు ఎల్లా ఉన్నాడు? నాకు ఎవ్వరు చెబుతారు? ఎక్క డున్నాడు? కేకలు పెట్టనా?" అనే గాభరా మాటలు వినొచ్చినయి. తండ్రీ, కూతురూ అతి గాభరాగా సైకిల్ మీది నించీ దూకేశారు. రెండు అంగల్లో గుమ్మంలోకి వచ్చేశారు.

అప్పటికి పార్వతమ్మ గబగబ నడుస్తూ గుమ్మం దగ్గరికి వచ్చి చతికిలబడి, రెండు చేతులతో ముఖం కప్పుకుని చిన్నగా వెక్కివెక్కి ఏడుస్తున్నది.

"అమ్మా, అమ్మ గారూ, అమ్మ గారూ!" పిలిచింది ఆత్రుతగా సిరి దేవి.


"అమ్మా, ఏమైం దండమ్మా?" అడిగేశాడు గోపాలం.

పార్వతమ్మ తలెత్తి చూసింది. కళ్లు మన ప్రజ్ఞలో లేవు పూర్తిగా.

"అమ్మా చెప్పండమ్మా, ఏంవి టయిందమ్మా?' ' రెట్టించాడు గోపాలం.

"అబ్బాయి రాలేదు గోపాలం" అంది పార్వతమ్మ ముఖం కొంగుతో తుడుచుకుంటూ, మతి తెచ్చుకుంటూ.

"దానికీ అమ్మా, ఇంత గాభరా పడతా వుండారు? కాశంత పని ఎక్కువై వుంటాది"



అన్నాడు గోపాలం ఓదార్పుగా.

"అంతే అయ్యిం దనుక్కుంటా" అంది సిరి దేవి కాస్త ఆలోచనగా.

"నా కెల్లాగో ఉందే పిల్లా, వాడు నాకు చెప్పకుండా రాత్రి ఆగడు. వాడు శ్రీరాములు లాంటి వాడమ్మా, నా కొడుకు!" అంది పార్వతమ్మ మనస్సు బాధతో. "ఒక్క అర నిమిషం ఆలస్యం చెయ్య లేదు నాకు చెప్పకుండా. అందుకనే దిగులుగా ఉంది" అంది తిరిగి, వాళ్ల కేసి చూస్తూ.

వెంటనే గోపాలం "ఇం కాచ్చేపు శూద్దాం అమ్మ గారు. అట్లా గనక, ఇంకా రాక పోతే, జగద్దేశాలు తిరిగి అయినా సరే. నేను ఎళ్లి

అబ్బాయిన సైకిల్ ఎక్కిచ్చుకుని ఒచ్చి మీ ముందర నిలుపుతాను. నాది ఆ పూచి" అన్నాడు దృఢంగా, మెట్ల మీద కూచుంటూ.

"ఒక వేళ ఏద్దైనా పని మీద వెళ్లేరేమో, అమ్మా, అబ్బాయి గారు" సిరి దేవి ఆలోచనగా.

"మీ కెందుకమ్మ గారూ, బయ్యం? నేరు ఆపీసు కెళ్లి సంగతి ఏంటి అని కనుక్కొస్తాగా! అబ్బాయి గారు ఏ ఏళకి వచ్చినా గాని, రానియ్యండి. అందాకా మిమ్మల్ని ఒంటిగా ఒదిలేసి మేం ఎళ్లం. అబ్బాయి గారు ఇచ్చాక మిమ్మల్ని ఒప్ప జెప్పి గాని మే మిద్దరం కదలం. ఏంవైనా సరే!" అన్నాడు గోపాలం. "మీకెందుకు బయ్యం? తీసికొచ్చే దానికి నేను లేనూ?" అన్నాడు తిరిగి.

"అమ్మా, మొట్టమొదట ఈ ప్రసాదం కాస్త తీసుకోండి" అంది సిరి దేవి చేతులో ఉన్న కాయితం పొట్లం విప్పి ఇస్తూ.

పార్వతమ్మ పొట్లం అందుకుని కళ్లకి అద్దుకుంది.

"సిరి దేవి, అమ్మ గారికి పక్క వెయ్యమ్మా" అన్నాడు గోపాలం.

"ఒద్దు గోపాలం, నాకు నిద్ర రావడం లేదు' ' అంది పార్వతమ్మ.

"మొదట మనస్సు కుదట పడా లండి అమ్మ గారు. మీ మందుల కోసం ఎళ్లినప్పుడల్లా డాక్టరు గారు ఆ మాటే చెపుతా రండి నాతో. మీ జబ్బుకి దిగులు ఉండ కూడ దంటండి. సిరి దేవి, అమ్మ గారికి ఆ బి.పి. మాత్ర ఒకటి ఇయ్యి" అన్నాడు గోపాలం.

"నాకు ఏ మాత్రలూ వద్దర్రా. మొదట వాడు రానివ్వండి" అం దావిడ తలుపుని ఆనుక్కుని.

"అల్లా కాదండి అమ్మ గారు. మాత్రకి గుండె నెమ్మ దవుద్ది. మీకు నిద్ర పట్టుద్ది. అబ్బాయి గారు ఏ ఏళకి ఒచ్చినా మే ముండాం గదా లేపటానికి? " అంటున్నాడు గోపాలం.

"నాకు నిద్ర వద్దయ్యా" అంది పార్వతమ్మ ఏదో ధ్యానంగా అతని మాటకి అడ్డు తగులుతూ.

"అమ్మా, అబ్బాయిగారు ఒచ్చే టప్పటికి మీరు ఇల్లా జబ్బు చేసినట్టుంటే ఆయన గుండె ఎలా కొట్టుకుంటుంది? ఇదోండి మాత్ర" అంటూ గూట్లో నించీ తెచ్చిన మాత్రా, చెంబుతో ముంచి పెట్టిన నీళ్లూ చేతి కిచ్చింది సిరి దేవి. విధి లేనట్లు అందుకున్న పార్వతమ్మ, నిమ్మళంగా నోట్లో వేసుకుంది.

"అమ్మ గారూ, మీ కోసమే గదాండి అబ్బాయి గారు ఇంత కష్ట పడేది? ఆయనకి మీ రొక్కరే గదా దిక్కు! మీరే ఇట్లా దివాళాగా ఉంటే ఆయనకి ఎంత చివుక్కు మంటుందో మనసు, తెలుసా?" అన్నాడు దోపాలం.

"ను వ్వనేదీ నిజమే గోపాలం. అయితే మరి ఎందుకు రాలే దంటావు? ఏమయిం దంటావు?' ' అడిగింది నిమ్మళంగా.


"అబ్బాయి గారు రాంగానే తెల్చి పోద్దిగా మనకి! ఆయనే చెప్పుతారుగా!" అన్నాడు గోపాలం.

"అమ్మ గారూ, ఇట్లా ఈ చాప మీద ఒడ్డిగిలండి. దుప్పటి ఏశాను" అంది సిరి దేవి.

"అబ్బాయి గారు ఏ టయ్యానికి ఒచ్చినా మిమ్మల్ని శూశేటప్పుటికి సంతోషంగా ఉండాలి గదా. మీరే ఇట్లా ఉంటే ఇంక ఆయన గారు ఏమయిపోతారు? మీరే ఆలోచిచ్చుకోండి తల్లీ!" అన్నాడు గోపాలం దీనంగా.

"ఏమో గోపాలం, అనుక్కోకుండా, నువ్వు, సిరి దేవి ఈ సమయానికి ఒచ్చారు గనుక నాకు ఈ మాత్రం ధైర్యమూ, నెమ్మదిన్నీ. లేక పోతే ఏమై పోయి ఉందును నేను!" అంది పార్వతమ్మ, బలహీనంగా.

"అంతా ఆయన పేరేపణే అనుక్కోండి అమ్మ గారు" అన్నాడు గోపాలం తన రెండు అరి చేతులు ముఖం దగ్గరగా వెల్లికిలా తెరిచి పైకి చూపిస్తూ,




తల కూడా కొంచెం పైకి ఎత్తి.

అల్లా ఓ పావు గంటలో మాత్ర పని చేసింది. పార్వతమ్మకు కళ్లు మూతలు పడుతూన్నయి. గుమ్మానికి అడ్డంగా బైట కింద మెట్ల మీద గోపాలం ముడుచుకుని పడుక్కున్నాడు. తలుపు తెరిచి పెట్టే ఉన్నది. రాత్రి లైటు వేసి, అమ్మ గారి కాళ్ల పక్కన దావిణి పరుచుకుని సిరి దేవి ఒరిగింది. నిద్ర రావడం లేదు. అమ్మ గారికి ఇప్పటికి నెమ్మ దైంది. ఈ నిద్ర మెలకువ రాక ముందే, అబ్బాయి గారు ఒచ్చేస్తే పరవా లేదు. ఆయన రావడం ఇంకా ఆలస్యం అయితే, అమ్మ గారికి ఇంకా ఆందోళన ఎక్కు వవుతుందే! ఎట్లా? ఇవ్వే ఆలోచనలు. గాఢ నిద్ర రావడం లేదు. రాత్రి గడుస్తోంది.

పక్క మేడ వారి గొడ్ల చావిట్లో వాళ్ల ఆవు అంబా అని అరిచింది. గోపాలం కోడి నిద్రలో నించీ కళ్లు నులుచుకుంటూ లేచి కూర్చు న్నాడు. నిమ్మళంగా జాగ్రత్త గా సిరి దేవి కాలు అలికిడి లేకుండా వచ్చి తండ్రి పక్కన కూచుంది.

"శూడమ్మా, అబ్బాయి గారు రానే లేదు. పొద్దు పొడిశాక వస్తా డనుక్కుంటా" అన్నాడు నిమ్మళ స్వరంతో.

"మరే నాయనా, పని ఎప్పుడు అయి పోతాదో, అప్పుడు వచ్చేస్తా రను క్కుంటాను. అసలు అమ్మ గారు లేచే సరికల్లా ఒచ్చేస్తే అమ్మకి దిగు లుండదు' ' అంది సిరి దేవి, అదే నిమ్మళ స్వరంతో, కాస్త ఆలోచనగా.

"నిజమే అమ్మా, శూద్దాం. నేను తోటకి ఎళ్లి నల్లి గాణ్ని లేపి పాలు తీసుకుని వచ్చేస్తాను. ఇయ్యాళ వాడే పువ్వులు కోస్తాడులే. వెంటనే ఎళ్లి గుళ్లో పువ్వు లిచ్చి వాడిక పాలు, పువ్వులూ ఇచ్చి వచ్చేస్తాను. అప్పు డేల దాకా, అబ్బాయి గారు రాకుండా పోతే, నేను వెంటనే గుప్తా గారి ఆపీసుకి ఎళ్లి సంగతి ఏంటని తెలుసుకుని ఆయన్ని కూడా ఎక్కిచ్చుకుని వచ్చేస్తాను" అని సైకిల్ తాళం తీస్తూ, మళ్లీ. "అమ్మా, నువ్వు మాత్రం శడీ శప్పుడూ శెయ్యకుండా వాకిళ్లు ఊడ్చి, ముగ్గులు ఏసి, పాశి పని ఇలంతా చేసెయ్యాల. తోటలో నల్లి గాడు చేసేస్తాడులే. బద్రం" అన్నాడు.

తండ్రి వెళ్లిన తరువాత సిరి దేవి నిమ్మళంగా వంగి లోపలికి చూచింది. పార్వతమ్మ ఇంకా గాఢ నిద్రలోనే ఉంది. శబ్దం ఏమీ చెయ్యకుండా, తన పనులు మొద లెట్టింది.

గేటు దగ్గర ముగ్గు వేస్తూంటే, ఎక్కణ్నించో సైకిల్ ఒకటి వస్తున్నట్టూ శబ్దం వినిపించింది. కాస్త ఆత్రంగా నిలబడి చూచింది కను చీకటిలోకి. "అబ్బాయి గారు సైకిల్ మీద రారే! ఏమో! ఒక వేళ లేటు అయింది అని" అనుక్కుంటూ ఉండంగా సైకిల్ ఆగింది. తేరి పరకాయించి చూచింది సిరి దేవి. ఒక పదమూడు పద్నాలుగేళ్ల ఛిన్న పిల్ల వాడు

దిగాడు.

"ఇది మాదవయ్య మాస్టరు గారి ఇల్లేనా?" అన్నాడు చిన్న వాడు.

"అవును. ఎవరు కావాలి?" అడిగింది సిరి దేవి.

"అమ్మ గారు కావాలి" అన్నాడు చిన్న వాడు.

"అమ్మ గారు ఇంకా నిద్ర లేవ లేదు" అంది సిరి దేవి.

"నువ్వు పని పిల్లవా? అయితే ఈ ఉత్తరం అమ్మ గారికి ఇచ్చెయ్యి" అంటూ అంటించిన ఒక కవరు చేతి కిచ్చి, తుర్రున సైకిలెక్కి వెళ్లి పోయాడు, వచ్చిన దారినే తిరిగి.

సిరి దేవికి ఇది ఏమిటో అర్థం కాలేదు. ఏమి చెయ్యాలో తోచ లేదు. ఆ కవరు ముగ్గు వేళ్లతో పట్టుకుని లోపలికి వచ్చింది. తలలో ఏమేమిటో ఆలోచనలు రాసాగినయి.

"ఒక వేళ అబ్బాయి గారే అమ్మ గారికి రాశారా? అట్లా అయితే మరీ మంచిదేగా" అనుక్కుంటూ గబగబ అడుగులు వేసింది. "అవునూ, ఒక వేళ అబ్బాయి గారే రాసి ఉంటే కూడా తనే గదా చదవాల! అన్నీ తననే గదా చదవమంటారు, అమ్మ గారు ఎప్పుడూ" అనుక్కుంటూ, గుమ్మంలో లైటు కింద అరుగు మీద కూచుని ఆ ఉత్తరం ఆత్రుతగా చించి విప్పి, శ్రద్ధగా చదివింది గబగబా. ఒక్క క్షణం కళ్లు మూసుకుంది తల పైకెత్తి. చటుక్కున ఒక నిర్ణయానికి వచ్చింది.

ఆ ఉత్తరం మట్టుకు మడిచి జాకెట్టు జేబులో భద్రంగా పెట్టుకుంది.

అడుగుల చడి లేకుండా ఇంటోకి వెళ్లి అబ్బాయి గారి షెల్ఫ్‌లో నించీ ఒక కాయితమూ, ఒక పెన్నులూ తీసుకుని అల్లాగే బయటికి వచ్చింది తిరిగి. అరుగు మీద కూచుని పట్టి పట్టి ఒక ఉత్తరం రాసి, ఆ కుర్ర వాడు తెచ్చి ఇచ్చిన కవరులో పెట్టి, నిశ్శబ్దంగా, మెల్లిగా పార్వతమ్మ తలగడా కింద పెట్టేసింది. లైటు ఆర్పేసి నూతి దగ్గర పనులు చూచుకుంటూంది.

కాస్సేపట్లో గోపాలం తెచ్చిన బుడ్డి చెంబుడు పాలు ఎప్పట్లా కిటికీలో పెట్టి, రెం డడుగులు నూతి పక్కకి వేసి, "అమ్మా! ఒక వేళ అమ్మ గారు గనక లెగిస్తే నేను ఒక్క అర గంటల్లో వచ్చేస్తానని చెప్పు" అని చెప్పి వెంటనే సైకిల్ ఎక్కేశాడు.

సిరి దేవి తొట్టెలు నింపి గుడ్డలు ఆరేసి, అన్ని పనులు ముగించుకుని, వచ్చి గడపలో కూచుంది మెట్ల మీద.

గోపాలం వచ్చేశాడు . "ఏమిటమ్మా ఇది! ఇంక, ఇప్పుడు నాకే దిగులు పుట్టు కొస్తా వుండాది, అబ్బాయి గారి విషయం. ఎట్లా?" అంటూ అరుగు మీద కూచోబడ్డాడు.

"భయం దేనికి నాయనా? అబ్బాయి గారు అమ్మ గారికి ఒక ఉత్తరం రాసి ఒక కుర్రాడి చేతికి ఇచ్చి పంపారు ఇప్పుడే" అంది సిరి దేవి.

'అబ్బాయి గారు' అన్న మాట నిద్దట్లో ఉన్న పార్వతమ్మకు ఏ లోకం లోనో వినిపించింది. ఆవిడ కాస్త కదిలి, కళ్లు తెరవడానికి ప్రయత్నిస్తోంది. "అమ్మ గారూ! లెగవండి లెగవండి. అబ్బాయి గారద్ద నించీ ఉత్తరవ ఒచ్చింది" అన్నాడు గోపాలం, కాస్త గట్టిగానూ, సంతోషంగానూ.

పార్వతమ్మ "ఉత్త రమా? ఉత్తర మెందుకు? అసలు ఉత్తర మేమిటి? వాడు ఎక్క డున్నాడు? ఎందుకు రాలే? ఎల్లా ఉన్నాడు?" ప్రశ్నలు కురిపించింది గబగబా. నిద్ర మగత వదిలింది. ఆత్రుతగా వీ ళ్లిద్దరి కేసి చూస్తున్నది.

"ఉల్లి పువ్వు ఉల్లి పువ్వే - మల్లి పువ్వు మల్లి పువ్వే! పులి కడుపున శలి శీమ పుట్టుద్దా అని-కాసంత లేటు అయ్యేతలికల్లా అబ్బాయి గారు ఉత్తరం ఏశేశారు, తల్లి, మీరు దిగులు పడకూడదని' ' అన్నాడు గోపాలం ముసి నవ్వు సంతోషంతో.

"ఏదీ? ఉత్తరం ఏది అమ్మాయ్?" అని అడిగింది పార్వతమ్మ ఆశగా.

"ఏదమ్మా ఉత్తరం? ఏదీ మాకు శదివి ఇనిపిచ్చు తొందరగా" అన్నాడు గోపాలం.

సిరి దేవి సంతోషంగా, ఒక్క అంగలో పార్వతమ్మ ఉన్న చాప దగ్గరికి వచ్చి, తల దిండు కింద ఉన్న ఉత్తరం తీసి "ఇదిగో నండీ" అంటూ అమ్మ గారి చేతి కిచ్చింది. "నేనే చించానండి. అబ్బాయి గారిదని తెలియంగానే మీ వద్దనే పెట్టేశాను" అంది ఇస్తూ.


పార్వతమ్మ ఆప్యాయంగా ప్రేమతో అందుకుని, కవరులో నించీ ఉత్తరం తీసి, సిరి దేవి చేతి కిచ్చి "చదువు పిల్లా, తొందరగా చదువు" అంది.

సిరి దేవి వినయంగా కాళ్లు ముడుచుకుని ఎదురుంగా కూచుని చదివింది.

"అమ్మకి ప్రేమతో నమస్కరిస్తూ

"అమ్మా, భయపడ వద్దు. నేను సుఖంగానే ఉన్నాను. నీతో చెప్పటానికి ఏ మాత్రమూ టైం లేక పోయింది. మన పక్క బస్తీ, చింతాయ పాలెంలో చాలా మంచి ఉద్యోగం దొరికింది. రెండు నెలలు

## చిట్కా



**మీది పొడి చర్మమా!**

అయితే మీరు ఆలీవ్ ఆయిల్ చుక్కలు గాని, కొబ్బరి నూనె చుక్కలు గాని స్నానం చేసే నీళ్లలో వేసి స్నానం చేసి చూడండి.

చేస్తే చాలు. చాలా పెద్ద జీతం. నేను డబ్బుతో వస్తాను. రాంగానే నీకు ఆపరేషను చేయిస్తాను. జీవితం అంతా సుఖంగా ఉండ వచ్చు. ఇహను దిగులు పడ వద్దు. వేళ వేళకీ మందులు వేసుకో. వేళకి భోంచెయ్యి. ఇహను ఇంటి పనులన్నీ గోపాలం గారే చూచుకుంటారు. అసలు ఆయన్ని నమ్మే ఈ ఉద్యోగం ఒప్పుకున్నాను.

"ప్రేమతో

"నీ కొడుకు రాఘవుడు."

వెంటనే గోపాలం కాస్తగా లేచి, తన రెండు అర చేతులతో ఒక చప్పుడు తట్టాడు. "నన్ను ఇంత బాగా అర్థం చేసుకున్నారూ అంటే, అబ్బాయి గారు ఎంత బుద్ధిశాలి అనుకోవాలి. ఇంకా చెప్పాల్సింది ఏం వుండాది తల్లీ! దిగు లనేదే ఒద్దు మీకు" అన్నాడు గోపాలం, మళ్లీ కూచుంటూ.

పార్వతమ్మ సిరి దేవి చేతుల్లో నించీ ఆ ఉత్తరం తీసుకుని కళ్లకి అద్దుకొని చేత్తో పట్టుకునే ఉంది, కూచుని ఏదో ధ్యానంగా.

"అమ్మ గారూ, శంక మీదట అన్ని ఆలోచనలూ మానెయ్యా లండి మీరు, అబ్బాయి గారు ఒచ్చే దాకా. అందాకా మే మిద్దరం ఇక్కడే పడి ఉంటాంవండి. సిరి దేవి పావడాలు, గట్రా ఆరేసినయ్యి ఉండా యండి తోటలో. అయ్యి తెచ్చేస్తాను. మీరు ఏళ ఏళకీ ఒక కబళం బోంచెయ్యాల. అంతే నండి.. ఎప్పుడు ఏ యే మందు లియ్యాలో సిరి దేవి సూసుకుంటాది, తల్లీ. బియ్యమూ, పప్పులూ, గట్రా తోటలో ఉండా యండి మన ఇంట్లో . అక్క డెందుకు, ఇక్కడకే తెచ్చేస్తాను" అన్నాడు గోపాలం ఏకదాటిగా.

"ఎందుకయ్యా అవ్వన్నీ? అన్నీ ఇక్క

డున్నాయిగా! ఇవ్వన్నీ అయి పోతే అప్పుడు చూద్దాం లే" అంది పార్వతమ్మ, చేతిలో ఉన్న ఉత్తరం తలగడ కింద పెట్టుకుంటూ.

"ఉండండి. చాలా టైం అయిపోయింది. మీకు కాఫీలు పెట్టేస్తాను" అని లేవబోతూ ఉండగా, గోపాళం, "సిరి దేవి, అమ్మ గారికి పాలు మట్టుకు కాచి ఇయ్యి, స్టోవ్ ముట్టిచ్చి" అంటూ, బుడ్డి చెంబు సిరి దేవి చేతి కిచ్చాడు.

కాస్సేపు అయ్యాక కాళ్లు కాస్త దూరం మడిచి పెట్టుకుని గోడకి జారగిలబడి కాఫీ తాగుతున్న గోపాలం, ఇంటి ముందర ఆవరణ కలియ జూస్తూ "రేపు కాంపౌండు అంతా చదును చేసి పువ్వుల మొక్కలు, నార తెచ్చి నట్టేస్తాను. అబ్బాయి గారు వచ్చే టప్పటికి ఇల్లంతా నవ్వుతా ఉండొద్దా?" అన్నాడు సిరి దేవితో.

చేతిలో ఉన్న గిన్నె చూపిస్తూ, "నాయనా, ఈ చద్ది అన్నం నీకు పెట్టేస్తాను" అంది సిరి దేవి.

"అమ్మా, మీరు వంట చేసుకుని బోంచెయ్యండి" అన్నాడు గోపాలం, గుమ్మం లో నించీ బయటకి వస్తోన్న పార్వతమ్మను చూచి.

"నా కింకా అన్నం మీద లేదు గోపాలం. మీకు వంట చేస్తాను" అంది పార్వతమ్మ.

"అమ్మ గారు, కాస్త మజ్జిగతో నైనా బోంచెయ్యాలి తల్లీ. అబ్బాయి గారు వచ్చాక చెప్పే దానికి నాకు జవాబే ఉండ దండి, మీరు గనక బాగా లేకపోతే" అన్నాడు గోపాలం.

"నాయనా, మరి కాస్త ఉండాది. గిన్నెలో పెట్టి, ఆవ కాయ పెట్టి ఇస్తాను. తోటకి వెళ్లి నల్లి గాడికి ఇచ్చి రా" అంది సిరి దేవి.

అల్లా అల్లా రోజులు గడుస్తున్నాయి. తొలకరి తిరిగింది. అడపాదడపా చినుకులకి తామర గుంటలో మడుగులు పెద్ద వైనయి. ఎండలు మాత్రం తగ్గ లేదు.

రెండవ నెల కూడా గడిచి పోతూంటే, అబ్బాయి వద్ద నించీ తిరిగీ ఉత్తరమే లేదే అని పార్వతమ్మకు దిగులు ఆరంభ మైంది.

భోజనం తగ్గింది. నిద్ర తగ్గింది. నడక మందం అయింది. ఒక్క సారి చెకప్‌కు డాక్టరుగారు రమ్మంటే, రానంటే రానం దావిడ. "మరీ బాగా లేక పోతే చూద్దాం లే" అంది.

"మీరిట్లా బోంచెయ్యకుండా ఉంటే నాకూ, సిరి దేవికీ కూడా అన్నం ఒద్దు లెండి అమ్మ గారు" అనేశాడు గోపాలం, ఒక రోజు.


"అన్నం సాయించడం లేదయ్యా, అంతే గాని ..." అంది పార్వతమ్మ సమాధానంగా.

రెండు నాళ్లు గడిచాయి. అప్పు డప్పుడు పార్వతమ్మ గుండె మీద చెయ్యి వేసు కుంటున్నది. సిరి దేవి మరీ మరీ అడగగా "ఏమీ పరవా లేదే పిల్లా. కాస్త అప్పు డప్పుడు నొప్పిగా ఉంటూంది, అంతే" అంది.

సిరి దేవి మనస్సు బరు వెక్కింది. ఏమి చెయ్యాలో తోచలే. రెండు నెలలు దాటిపోబోతూంది. నిప్పుతో చెలగాటలు ఆడుతున్నానేమో అని భయపడింది తను.

ఆ నాటి సాయంత్రం "అమ్మా!" పిలుచుకుంటూ నూతి దగ్గరకు వచ్చాడు విసురుగా గోపాలం.

"ఉష్! నాయనా, కాస్త నిమ్మళంగా మాట్లాడు. అమ్మ గారు లేస్తారు. మాత్ర ఇచ్చాను. ఇప్పుడే కాస్త నిద్ర పోతున్నారు. ఏంటి నువ్వు అనేది?" అంది చేతిలో ఉన్న పని ఆపి, నిమ్మళంగా కొంచెం చిన్న స్వరంతో.




గోపాలం తల ఊపుతూ, ఎదురుంగా గడ్డిలో కూచోబడి, "అమ్మా, నేను డాక్టరు గారిని చూసుకుని, ఎందుకైనా మంచిదని, బ్యాంకుకి వెళ్లి, ఉండే దాంట్లో నించీ ఒక ఇరవై వేల రూపాయలు తీసుకొచ్చా" అంటూ, తన షర్టు ఎత్తి లోపల బనియను జేబు మీద చేత్తో తట్టి చూపించాడు.

"అసలు డాక్టరు గారు ఏమన్నారు నాయనా?" అడిగింది సిరి దేవి.

"ఎంత తొందరలో అమ్మని ఆస్పత్రిలో చేరిస్తే అంత మంచి దన్నారు. ఒక వేళ ఆపరేశన్ అవసరమైతే కుమారుడు ఇంకా రాలేదే ఎట్లా? అన్నారు. ఆయన సంతకం లేకుండా ఆపరేశన్ చెయ్య కూడ దన్నారు."

సిరి దేవి శ్రద్ధగా వింటోంది.

గోపాలం తిరిగి "అబ్బాయి గారు అల్పిం అయితే నాకు సంతకం అచ్చరాలు తెలుసు, నేను సంతకం పెడతా నన్నానమ్మా, అది కుదర దన్నారు" అన్నాడు.

"అది ఎట్లా నాయనా? అబ్బాయి గారి సంతకం లేందే ఎంత లావు డాక్టరు అయినా ఆపరేషన్ చెయ్య కూడదే! అది చట్టం కాదు నాయనా!" అంది సిరి దేవి.

"చదివిన పిల్లవి నువ్వూ అట్టాగే అంటా వుండావే! చట్టమూ, రూల్సూ ఎక్కువా? మనిషి ప్రాణం ఎక్కువా?" అడిగాడు విసుగ్గా.

మరు నాటికి కాస్త ఎక్కు వైంది నొప్పి. కళ్లు తెరవ లేక పోతూంది పార్వతమ్మ. మాట్లాడ లేక పోతూంది. సాయంత్రం అయింది. ఎప్పట్లా పను లన్నీ ముగించుకుని, దీపారాధన చేసి, సిరి దేవి మంచం దగ్గరికి వచ్చి, "అమ్మ గారూ! ఎట్లా ఉందండి?" అంది బతిమాలినట్టూ మంచం పక్కగా కూచుని.ఏమీ బాగా లేదు పిల్లా. ఒక మాదిరిగానే ఉంది. అబ్బాయి రాలే ఇంకా?" అం దావిడ ఆయాసంగా, వినీ వినబడని స్వరంతో.

"వచ్చే వేళ గదా అమ్మా. ఏ టైమ్ కయినా రావచ్చు" అంది ఆమె తల పక్క దిండు మీద చెయ్యి రాస్తూ. అంతలోనే గోపాలం అవసరవసరంగా అంగ లేసుకుంటూ లోపలికి వచ్చేశాడు. వస్తూనే "అమ్మా, అమ్మ గారిని ఈ ఏళే, అంటే ఇప్పుడే తీసుకుని రమ్మన్నారు. ఎవ్వరో స్పెషలిస్టు డాక్టరు గారు వచ్చారుట. అందుకని అమెరికన్ ఆస్పటల్‌లోనే చేర్చెయ్యాలన్నారు డాక్టరు గారు. మళ్లీ చాన్సు దొరక దంట. అందుకని అన్ని ఏర్పాట్లూ చేసి వచ్చాను. ఆటో అయితే ఎత్తి కుదేస్తాదని, టాక్సీ తెచ్చేసినాను. అమ్మ గారిని కొంచం తొందరగా లేవ దియ్యమ్మా" అన్నాడు గబగబా. "అమ్మా గారూ, కాళ్ళంత కష్ట పడి లెగవండి" అన్నాడు పార్వతమ్మను చూస్తూ.

"డాక్టరు వద్దులే అయ్యా ..." అంది ఆవిడ

## సాహస బాలలు - 5

# మునిగిపోతున్న విద్యార్థులను రక్షించిన అమీర్ పాషా



గత సంవత్సరం ఫిబ్రవరి 20వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్‌లోని శ్రీ సత్యసాయి పాఠశాలకు చెందిన 21మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు కలసి సోమశిల గ్రామానికి విహార యాత్రకు వెళ్లారు. అక్కడ కృష్ణానదిపై నిర్మించిన సోమశిల ప్రాజెక్టును, ఆ పరిసర ప్రకృతి రామణీయకతను చూశారు. వారిలో 10 మంది విద్యార్థులు తమ ఉపాధ్యాయునితో కలసి ఆ కృష్ణానదిలో బోటు షికారుకు వెళ్లారు. వారు ఎక్కిన పడవ 75 గజాల దూరం వెళ్లిందో, లేదో హఠాత్తుగా అదుపు తప్పి బోర్లా పడిపోయింది.

ఆ ఒడ్డునే కూర్చుని ఉన్న ఆ గ్రామ నివాసి పన్నెండేళ్ల సయ్యద్ అమీర్ పాషా (బాపు గయాధని అవార్డు గ్రహీత) అనే బాలుడు పడవలోని వారంతా నీటిలో పడిపోవడం చూశాడు. వారి ప్రాణాలకు ముప్పు ఏర్పడిందని గ్రహించిన సయ్యద్ వెంటనే అక్కడే ఉన్న మరో పడవ ఎక్కి వారి వైపు నడిపాడు. ఆ పడవకు తెడ్లు లేకపోవడంతో తన చేతులతోనే నీళ్లు తోస్తూ ముందుకు సాగాడు. అత్యంత ధైర్యంతో, ఎంతో కష్టపడి ఇద్దరు విద్యార్థినులను, ఉపాధ్యాయుడిని ప్రాణాలతో బయటకు తీశాడు. మరో ముగ్గురు విద్యార్థులు ఎలాగో వారే ఈదుకుంటూ ఒడ్డుకు చేరారు. దురదృష్టవశాత్తూ మిగిలిన అయిదుగురు విద్యార్థులు జలసమాధి అయ్యారు.

ఏమైనప్పటికీ, ముగ్గురు విద్యార్థుల విలువైన ప్రాణాలను, వారి ఉపాధ్యాయుడి ప్రాణాలను కాపాడిన అమీర్ పాషా ధైర్య సాహసాలు ప్రశంసా పాత్రమైనవి.

Ⓟ అనిపెద్ది వెంకట రమణరావు

---

నీరసంగా.

"అమ్మ గారూ! కాస్త కళ్లెత్తండి. కొంచం నా ముఖ ంచూడండి. అబ్బాయి గారు మిమ్మల్నీ, ఇల్లూ వాకిలీ ఒదిలి, పెద్ద జీతానికి వెళ్లిందే మీకు ఆపరేషన్ చేయించడానికి. ఆయన వచ్చే లప్పటికి మీరు ఇల్లాగ ఉంటే, ఎంత దిగాలు పడి పోతారో, ఆయన, మీరే యోచిచ్చుకోండి. ఆయనకి కొంచం చెయ్యూత ఇయ్యండి. అబ్బాయి గారి కోసమైనా ఆస్పత్రికి రావాలి. నా మీద ఆనుక్కుని నడుద్దురు కారు దగ్గరికి" అంటూ అమ్మ గారి రెండు చేతులూ పట్టుకుని నిమ్మళంగా లేపింది. అడుగు మీద అడుగు వేసుకుంటూ, టాక్సీ దగ్గరికి వెళ్లే టప్పటికి పావు గంట అయింది.

కారులో కూచో పెట్టి, వెనక్కి తల ఆనుక్కో పెట్టి, నిదానంగా, సిరి దేవి, ఇంటికి తాళాలు వెయ్యడానికి, ఒక్క పరుగున ఇంటోకి వెళ్లింది, "ఒక్క నిమిషంలో వచ్చేస్తా" అంటూ. గోపాలం కారు తలుపుని ఆనుక్కుని తల నిలపలేక పోతే పట్టుకోడానికి సిద్ధంగా నించునే ఉన్నాడు, కింద తలుపు తీసి పట్టుకుని. చుట్టూ ఊరంతా ఆనుగా మసక మసకగా కనిపిస్తూనే ఉంది. పంట కాలవలు నిండినయి. కొంచం దూరంలో, ఉన్నట్టుండి, ఆ కాలువ నీళ్ల మీది నించీ పక్షి ఒకటి చటుక్కున పైకి వచ్చి అరుచుకుంటూ ఎగిరి పోయింది. అక్కడ, అక్క ణ్నించీ దుక్కిటెడ్లకి దాణాలు పెడుతూన్న పాలేళ్లు పాడే సినీమా పాటలు వింటూ, కోలాటం పాటలూ వినబడుతూన్నాయి. అప్పు డప్పుడు తల లెత్తి, ఊపుతూన్న యెడ్ల మెడల్లో నించీ మువ్వల రవం గళ్ గళ్‌మని వినిపిస్తోంది. పసుపు కుంకాలతో పూజ లందుకున్న నాగళ్లు చిన్న రైతుల చావిళ్లలో పెట్టి ఉన్నాయి. ఆ రోహిణీప్రియుడు మనస్సు మళ్లి భూదేవి మీద వెన్నెలలు కురుస్తున్నాడు. భూదేవి మనస్సు చల్ల బడ్డది.

"ఈ వేళ ఏరువాక పౌర్ణమి తల్లీ. ఇంకా నయం. డాక్టరు గారు అర్జంటు సేశారు. ఏ సుస్తీ అయినా ఎక్కువ అవుద్ది పున్నానికి, అమావాస్యకి' ' అన్నాడు గోపాలం.

మరు క్షణం ఆటో రిక్షా ఒకటి విసురుగా వచ్చి గేటు ముందర ఆగింది. ఆటోలో నించీ రాఘవేంద్ర రావు దూకేశాడు.

ఎదురుంగా ఉన్న కారులోకి తొంగి చూచి, ఒక్క అంగ వేసి లోపలికి ఎక్కేశాడు, " అమ్మా, రాఘవుణ్ని వచ్చేశానమ్మా!" అంటూ. వెంటనే పక్కన కూచోబడి తల్లి తల నిమ్మళంగా ఒళ్లో పెట్టుకుని, "ఏ మయిందమ్మా? ఎల్లా ఉందమ్మా నీకు?" అంటూ ఉండగానే పార్వతమ్మ, "రాఘవా, వచ్చావుట్రా? ఎక్కడికి వెళ్లావురా? ఎపుడు వచ్చావు? ఏమిరా ఇంత చిక్కి పోయావు?" అని నీరసంగా ప్రశ్న మీద ప్రశ్న వేస్తూండంగా- ఒళ్లు తడుముతూ, ముఖం నిమురుతూ, "ఏమిరా నాయనా, ఇంత ఇల్లా అయిపోయావు?" అంది తిరిగి ఆత్రుతగా.

గోపాలం ఆనందంతో కొయ్యబారి పోయాడు. "సరింగా టైంకే ఒచ్చేసా రుండి, అబ్బాయి గారు. అబ్బాయి గారు, ఇంక ఏం బయ్యం లేదు, అమ్మ గారికి. నా కిప్పుడు ఏనిగిని ఎక్కినంత బలం ఒచ్చింది" అన్నాడు కాస్త తెప్పరిల్లి.

"గోపాలం గారేగా! మీరు లేక పోతే అమ్మకీ, నాకూ ఎవ్వ రండీ దిక్కు?" అన్నాడు రాఘవేంద్ర రావు హృదయ పూర్వకంగా, కృతజ్ఞతతో.

"అట్లా అనకండి బాబయ్యా. ముందర సరుగెత్తి కెళ్లి తలగడా ఒకటి తీసుకు రండిబాబూ. అమ్మ తల నేను పట్టుకుంటాను" అన్నాడు గోపాలం, చటుక్కున ఆలోచన తోచి.

"అమ్మా, ఒక్క నిమిషం. ఇదో వచ్చేస్తాను" అంటూ ఇంటోకి పరిగెట్టాడు సంచీ చేత్తో పట్టుకుని.

చెప్పుల శబ్దానికి తొందర తొందరగా కిటికీలు మూస్తున్న సిరి దేవి చటుక్కున పక్కకి చూచింది గుమ్మం కేసి. "అబ్బాయి గారాండి?" అంది.

"అవును. నువ్వు సిరి దేవివా?" అడిగాడు రాఘవుడు సంచీ కింద పెడుతూ.

"మరే నండి" అంది.

చటుక్కున రాఘవుడు తల్లి మంచం మీది నించీ తలగడా తీశాడు. దిండు కింద మడత పెట్టిన ఉత్తరం మీద "అమ్మకి ప్రేమతో రాఘవుడు' ' అన్న అక్షరాలు కనిపించినయి. వెంటనే మడత విప్పి చదివాడు. "ఇది నా ఉత్తరం కాదే! నేనెప్పుడూ ఇంత వరకూ అమ్మకి ఉత్తరం రాయ లేదే! ఇది ఎవరు రాశారు? ఎందుకు రాశారు? ఎవ్వ రిట్లా రాసింది?" ప్రశ్నలు వేసేశాడు విసుగ్గా, గాభరాగా, కటువుగా.

"అది రాసింది నేనేనండి, అబ్బాయి గారు" అంది సిరి దేవి వినయంగా, కాస్త భయంతో.

"నువ్వా? ఏం? ఎందుకు? ఎవ్వరు రాయ మన్నారు ఇల్లా?" అడిగాడు అదే ధోరణిలో

సిరి దేవి వెంటనే తన జాకెట్టు జేబులో నించీ తను దాచుక్కున్న పాత ఉత్తరం తీసి చేతి కిచ్చింది. గబగబా చదవ నారంభించాడు రాఘవేంద్ర రావు.

"మాధవయ్య అయ్యోరి ఇంట్లో అమ్మ గారికి నా దండాలు. మీ అబ్బాయి సుకంగా ఉండాడు. బయ్యం ఒద్దు. మా మంచి కుర్రోడు, అనుబవం తక్కువ అంతే. రొండు నెలల్లో తిన్నగా ఇంటికి ఒచ్చేత్తాడు. ఏ మాత్రమూ దిగులు పడొ ద్దండి. ఈ సంగతి మీకు తెలిస్తే మీరు ఒక్క చణం కూడా బతకరనీ, నిలువునా శచ్చి పోతారనీ, ఆయనకి వక్కరనీ మరీ మరీ ఏడ్చి ఏడ్చి, నాతో చేతుల్లో చెయ్యి ఏయించుకున్నాడు, మీకు చెప్ప కూడదని. గుప్తా గారి పని మీద బయట ఊరు ఎళ్లినట్టూ శెబుతా మన్నాను. ఈ ఊళ్లో ఉంగరాల రంగయ్య అనే దుష్టపోడు ఒకడు దొంగ వ్యాపారం చేస్తా ఉండాడు. వాడు మీ అబ్బాయిని వల్లో వేసుకున్నాడు. చట్టానికీ, రూల్సుకీ తెలవకుండా కొన్ని సరుకులు జారేస్తే శానా డబ్బు ఇస్తానని ఆశ పెట్టాడు. వాణ్ని పట్టాలని పోలీసులు శానా నాళ్ల నించీ సూస్తా ఉండారు. ఈళ్లిద్దర్ని కని పెట్టమని పోలీసులు నాకు ఒప్ప జెప్పారు. ఇయ్యాల సాయంత్రం చేతిలో సరుకులతో పోలీసులకి దొరుక్కున్నాడు. అందుకని మీ అబ్బాయిని జైల్లో పెట్టారు. కుర్రాడు శానా మంచోడు. అన్నీ శెప్పేశాడు. అబ్బాయి మైకంలో పడ్డప్పుడు అబ్బాయి పేరు మార్చి చెప్పేను పోలీసులకి నేను.అమ్మ గారికి మల్లా దండాలతో, సీమయ్య వ్రాలు."

రాఘవేంద్ర రావు ముఖం వెలవెల బోయింది. కళ్లు చెమ్మగిల్లినయి. "ఇది, ఈ ఉత్తరం ఇం కెవ్వరైనా చదివారా?" అడిగాడు వెంటనే దిగులుతో.

"నాకు తప్ప ఇం కెవ్వరికీ తెలియ దండి" అంది వినయంగా.

ఆ ఉత్తరం పట్టుకునే రెండు చేతులతో నమస్కరించాడు, రాఘవుడు సిరి దేవికి - కండ్ల తడితో.

సిరి దేవి తబ్బిబ్బు పడి పోయింది. "అయ్యొయ్యొ! అల్లా దణ్నం పెట్ట ఒద్దండి అబ్బాయిగారు! పెట్ట కూడ దండి. నేను చిన్న దాన్నండి. పైగా మీ కంటో అన్నిట్లోనూ తక్కువ దాన్నండి నేను" అంది బతిమాలుతున్నట్టూ, గాభరాగా తిరిగి నమస్కరిస్తూ.

"కాదు సిరి దేవీ, నా కంటే నువ్వు దేనిలోనూ తక్కువ దానికి కావు - ఒక్క వయస్సులో తప్ప' ' అంటూ ఒక్క అడుగు వేసి దేవుడి దీపానికి ఆ ఉత్తరం ముట్టించాడు.

వెంటనే సిరి దేవి అతని చేతుల్లో నించీ ఆ ఉత్తరం లాక్కుని "నేను కాల్చేసి వస్తా నండి అబ్బాయిగారు. మీరు ముందర ఆ దిండు తీసుకుని అమ్మ దగ్గరికి పరిగెత్తండి" అంది.


కారులోకి ఎక్కంగానే "ఇప్పుడు తలగడ అక్కర్లేదు లేరా. నీ ఒళ్లో తల పెట్టుకుంటాను" అంది పార్వతమ్మ.

గబగబ పరిగెత్తు కొచ్చిన సిరి దేవితో "అమ్మా! నీవు అమ్మ గారి కాళ్ల దగ్గర కూచో. కాళ్లు ఒళ్లో పెట్టుకుని కాళ్లు కిందికి జారి పోకుండా పట్టుకో" అన్నాడు గోపాలం. ముందర సీటులో నించీ. "బీగాలు బాగా ఏశావా అమ్మా?" అని అడుగుతూ పక్కకి తిరిగి ఇంటి వేపు బాధ్యతాయుతంగా చూచాడు గోపాలం.

వెన్నెలలో, పచ్చటి మొక్కలతో, ముగ్గులతో ఇల్లంతా కలకల లాడుతూంది.

"కొంచెం స్పీడుగా ఒదులు తమ్ముడూ బండి!' ' అన్నాడు పక్క డ్రైవరుతో గోపాలం.

**అయిపోయింది**




**కథనం:**

అ) ... అప్పుడు ఆదిభట్ల నారాయణదాసుగారు - "వెర్రినాయనా! నేను మాత్రం గోవులాంటి వాణ్ణి కానా?" అన్నారు.

పశుగ్రాసం విషయంలో లాలూప్రసాద్ యాదవ్ గారిని నిలదీస్తే ...??!

**నిర్-వచనం:**

ఆ) గొంగడి కప్పినవాడల్లా గద్దర్ కాడు.

**వచనం:**

ఇ) స్టీరింగ్ కమిటీ సమావేశంలో నూతన మంత్రివర్గం జాపితా ఖరాబు!

... ఇంతేకాదు; ఇంకా ఇలాంటి ఉ, ఊలతో ఎ, ఏలతో ల...క్షణంగా జోకులతో, షాకులతో వారం వారం మీ కోసం

**వచ్చే సంచికనుండి ప్రారంభం...**